ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో **ఒక పూర్తి పేజీ**

epaper.vaartha.com WWW.VAARTHA.COM


తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కరీంనగర్

fb.com/vaartha Digital

Published from Karimnagar, Warangal, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

25-10-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 265 పేజీలు: 8+16 వెల: 8.00


టైగర్‌ప్రూఫ్ కల్వుల కేసులో కొత్తకోణం

ఇరాన్‌పై మళ్లీ అమెరికా భారీ దాడులు?

5



3

## గరిష్ట స్థాయికి పసిఫిక్ సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు

తొలిసారి 30 డిగ్రీల సెల్సియస్ పైకి పెరుగుతున్న ఎల్‌నినో ప్రభావం



5

## మా ఇద్దరి పరిచయం ఓ రెస్టారెంట్‌లో..

రాజీవ్‌గాంధీతో తొలి జ్ఞాపకాలను ట్విట్టర్‌లో పంచుకున్న సోనియాగాంధీ

ఆమె ఆత్మకథలో ఇటువంటి విషయాలు ఎన్నెన్నో!

## మూడు మండలాల్లో కరవు నివారణకు 150 కోట్లు



గ్రామసభల ద్వారా ప్రణాళికలు తయారీ

మహిళలు, యువత అవసరాలకు ప్రాధాన్యం

స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో ప్రాజెక్టు

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్,అక్టోబరు24,ప్రభాతవార్త:** కరవు పరిస్థితులు ఎప్పుడు తలెత్తినా ప్రజలు, రైతులు తట్టుకునేలా రాష్ట్రంలోని మూడు మండలాల్లో 150 కోట్ల రూపాయిలతో శాశ్వత నివారణ చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు నీటివనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం, రైతు కుటుంబాల జీవనోపాధిని మెరుగుపరచడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చారిత్రకంగా కరవు ప్రభావానికి గురవుతున్న ప్రాంతాలు, వర్షాధార వ్యవసాయం అధికంగా ఉన్న జిల్లాలు, సామాజిక-ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలు, రైతు కుటుంబాల జీవనోపాధి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రాంతాలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. జాతీయ విపత్తుల నిర్వహణ నిధి (ఎన్‌డిఎఫ్) సహకారంతో ఈ ప్రాజెక్ట్ చేపట్టినట్లు తెలిపారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ, విపత్తు నిర్వహణ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. తెలంగాణలో కరవునిరోధక వ్యవసాయ >>2

## నా చిన్నతనంలో అన్యాయాలను చూడలేకే నక్సలైట్ అయ్యా: మంత్రి సీతక్క

6

# పరిశోధనల్లో హైదరాబాద్ అగ్రగామి



హైదరాబాద్‌లో శనివారం జరిగిన రక్షా ఎక్స్‌పో-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో సిఎం రేవంత్, డి.సిఎం భట్టి, మంత్రులు ఉత్తమ్ కుమార్, శ్రీధర్‌బాబు తదితరులు

రక్షణ రంగంలో భారత్ టాప్‌కు ఎదగాలి

శాంతి పరిరక్షణకు ఆయుధాలు అవసరం

రక్షణ పరిశ్రమలో తెలంగాణ మరింత ముందుకు

గ్లోబల్ సమ్మిట్ భారీగా నిర్వహణకు ఏర్పాట్లు

రక్షా ఎక్స్‌పో-2026 ప్రారంభ సమావేశంలో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు24:** డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణగ్లోబల్ సమ్మిట్లో పాల్గొనాల్సిందిగా రక్షా ఎక్స్‌పో-2026 వారిని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. గతేడాది మొదటిసారి నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని, రెండోసారి నిర్వహించే సదస్సు మరింత భారీస్థాయిలో జరగబోతందని పేర్కొన్నారు. రక్షణ రంగానికి చెందిన భాగస్వాములందరితో ఒకే వేదికపై చర్చించే అంతర్జాతీయ వేదికగా రక్షా ఎక్స్‌పోను తీర్చిదిద్దాలన్నది నా ఆలోచన అని చెప్పారు. ఇదొక ప్రతిష్టాత్మకమైన కార్యక్రమం. ఈ సమావేశంలో రక్షణ, స్పేస్, ఏరోస్పేస్, భద్రతా రంగాలకు చెందిన ప్రముఖులు ఎంతో మంది ఉన్నారు. మన పారిశ్రామిక రంగానికి చెందిన దిగ్గజ సంస్థలు కూడా ఇక్కడున్నాయని చెప్పారు. శనివారం సాయంత్రం తాజ్ ఫలక్‌నూమాలో రక్షా ఎక్స్‌పో-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డిజిపి సివి ఆనంద్, రక్షణ రంగ నిపుణులు, భారత సాయుధ దళాల అధికారులు, కేంద్ర ప్రభుత్వ అధికారులు, వివిధ సంస్థల ప్రతినిదులు పాల్గొన్నారు. డిఆర్‌డిఓ, హెచ్‌ఏల్, >>2

## రేపు మహారాష్ట్ర సిఎం ఫడ్నవిస్‌తో సిఎం రేవంత్ భేటీ

తుమ్మిడిహెట్టిపై చర్చలు 2

## ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

నవంబరు 1 నుంచి బిజెపి పాదయాత్ర

ఓట్లు తొలగించారని ఒక్క ఫిర్యాదు లేదు

రాష్ట్ర బిజెపి చీఫ్ రాంచందర్‌రావు



**హైదరాబాద్, అక్టోబరు24, ప్రభాత వార్త:** తెలంగాణలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. తమ ఓటును తొలగించారని రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక్క ఓటరు కూడా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయలేదని, కానీ కాంగ్రెస్ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో పేదలు, ఆదివాసీలు, దళితులు, మైనారిటీలు, మహిళల >>2



శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో మంత్రి వివేక్ తదితరులు

# అది కమీషన్ల కాళేశ్వరం

నాణ్యతాలోపం వల్లే కూలిన బ్యారేజీలు

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లను స్వప్రయోజనాల కోసం వాడుకున్న బిఆర్‌ఎస్

కెసిఆర్ హయాంలో నీటిపారుదల నిర్వీర్యం

ఆ పదేళ్లలో కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా పూర్తి చేసిఉంటే కరవొచ్చేది కాదు: మీడియాతో మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, అక్టోబరు 24,ప్రభాతవార్త:** తెలంగాణలో నీటిపారుదల రంగాన్ని కెసిఆర్ సర్వనాశనం చేశారని నాణ్యతాలోపాల కారణంగానే బ్యారేజిలు కూలిపోయాయనీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. శనివారం సచివాలయంలో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ తామే కట్టాము తామే కూల్చాము అని చెప్పుకోవడానికి బిఆర్‌ఎస్ నాయకులు కన్నెపల్లి పర్యటన చేపట్టారా అని ఎద్దేవా చేశారు. కమీషన్ల కక్కుర్తితోనే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని అందుకే ప్రాజెక్టు వ్యయం ఇబ్బడిముబ్బడిగా పెంచి తెలంగాణను అప్పుల్లో >>2

## రైతు చెంప ఛెళ్లు

గజ్వేల్ పిఎస్‌లో ఓ ఎస్సై దాష్టీకం 3



# పులుల సంరక్షణకు 'గ్రేహౌండ్స్'!

ప్రయోగాత్మకంగా అమ్రాబాద్, కవ్వాల్‌లో అమలు

గ్రేహౌండ్స్ నిష్ణాతులతో రెండు బృందాలు

అటకెక్కనున్న ఆయుధాల ప్రతిపాదన

**హైదరాబాద్, అక్టోబరు 24,ప్రభాతవార్త:** తెలంగాణలో కవ్వాల్, అమ్రాబాద్ పులుల సంరక్షణ కేంద్రాలలో గ్రేహౌండ్స్ దళాలను ఉపయోగించడానికి ప్రభుత్వం ఆలోచనలు చేస్తోన్నది. తెలంగాణలో నక్సలైట్ల ప్రాబల్యం పూర్తిగా తగ్గిపోవడంతో గ్రేహౌండ్స్ దళాలను ప్రకృతి సంరక్షణ దిశగా వినియోగం చేయాలనే దిశగా పావులు కదుపుతున్నట్లు తెలిసింది. అందులో భాగంగానే టైగర్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రతిపాదన తెరపైకి రావడమే కాకుండా ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు వేగంగా అడుగులు వేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అటవీశాఖ అధికారులకు ఆయుధాలు ఇవ్వాలనే డిమాండ్‌కు ప్రత్యామ్నాయంగా గ్రేహౌండ్స్‌లోని నిష్ణాతుగైన రెండు బృందాలను ఇటు కవ్వాల్ అటు అమ్రాబాద్ పులుల సంరక్షణ కేంద్రాల్లో వినియోగించనున్నారు. కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం 2012లో అమ్రాబాద్ టైగర్‌రిజర్వు2014లో ప్రకటించారు. కవ్వాల్ అభయారణ్యం 892 చ.కి.మీ. కోర్ ఏరియా, 1123 చ.కి.మీ. బఫర్ ఏరియాగా విభజించారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టు 2800 చ.కి ఉంటుంది. ఇది టైగర్ రిజర్వు ఫారెస్టుగా ప్రకటించినప్పుడు ఇందులో 25పులులు ఉండేవి. అప్పటి నుంచి నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ ఆధ్వర్యంలో ఈ టైగర్ రిజర్వ్ ఫారెస్టులో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. >>2






శనివారం బెంగళూరులో 'సువర్ణ రథ్' టూరిస్టు రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న కర్ణాటక సిఎం డికె శివకుమార్

## కరవు నివారణకు 150 కోట్లు

>> విధానం అమలు, కరవు పీడిత ప్రాంతాల్లో శాశ్వత పరిష్కార మార్గాల అన్వేషణ, ప్రతిపాదిత ప్రాజెక్టు కార్యాచరణ, నిధుల సమర్థ వినియోగం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్, నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునూతల, నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈమొత్తం ప్రాజెక్ట్‌కు ప్రకృతి విపత్తుల శాఖ పర్యవేక్షణలో వ్యవసాయ శాఖ నోడల్ ఏజన్సీగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయడానికి ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని గ్రామ మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం తోపాటు, వర్షాభావ పరిస్థితుల్లో ప్రజలకు ఎదురయ్యే ఆర్థిక ఇబ్బందులను తగ్గించేందుకు చర్యలు చేపడతారని తెలిపారు. కరవు నివారణ ప్రాజెక్టు అమలులో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసుకోవాలని, ఎంపిక చేసిన మండలాల్లోని ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజల అభిప్రాయాలు, స్థానిక అవసరాలకు అనుగుణంగా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి లక్ష్యాన్ని చేరేలా, పారదర్శకంగా, బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రభుత్వ లక్ష్యాలు క్షేత్రస్థాయిలో నెరవేరుతాయని తెలిపారు. మహిళలు, యువత, రైతులు, కులవృత్తులపై ఆధారపడిన కుటుంబాలు సహా సమాజంలోని అన్ని వర్గాల అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. కరవు ప్రభావం ఒక్క వ్యవసాయ రంగానికే పరిమితం కాకుండా గ్రామీణ ఉపాధి, కుటుంబ ఆదాయాలు, సంప్రదాయ వృత్తులపై కూడా పడుతుందని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి వర్గానికి ప్రయోజనం చేకూరేలా, స్థానిక పరిస్థితులకు తగిన శాశ్వత పరిష్కారాలతో సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం వెచ్చించే ప్రతి రూపాయి సద్వినియోగం కావాలని మంత్రి స్పష్టం చేశారు. నిధుల వినియోగం, పనుల ఎంపిక, అమలు విధానం, క్షేత్రస్థాయి ఫలితాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు. కేవలం నిధుల ఖర్చు, పనుల పూర్తితోనే ప్రాజెక్టు విజయాన్ని అంచనా వేయకుండా, ప్రజలకు ఎంత మేరకు ప్రయోజనం చేకూరింది, కరవు సమస్యను పరిష్కరించడంలో ఎంత పురోగతి సాధించామన్నది ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో విపత్తు నిర్వహణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ, వ్యవసాయ శాఖ కమిషనర్ సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎన్. గోపి తదితర అధికారులు పాల్గొన్నారు.

## గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కేంద్ర మంత్రి, మాజీ గవర్నర్ భేటీ

**హైదరాబాద్,అక్టోబరు24,ప్రభాతవార్త:** తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ, సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి బన్వారీ లాల్ వర్మ, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల మాజీ గవర్నర్ కల్‌రాజ్ మిశ్రా లోక్ భవన్‌లో శనివారం సాయంత్రం కలిశారు.

## తెలంగాణలో ఎక్సైజ్ దాడులు.. గంజాయి స్మగ్లర్ల వద్ద మారణాయుధాలు స్వాధీనం

**హైదరాబాద్,అక్టోబరు24,ప్రభాతవార్త:** తెలంగాణలోని పలు ప్రాంతాల్లో శనివారం ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో మారణాయుధాలు కలకలం సృష్టించాయి. గంజాయి స్మగ్లర్ల వద్ద పిస్తోళ్లు, రివాల్వర్లు, బుల్లెట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాజేంద్రనగర్ అత్తాపూర్‌లో గంజాయితో పాటు రివాల్వర్, నాలుగు పిస్తోళ్లను పట్టుకున్నారు. మరో కేసులో భద్రాచలం పాల్వంచ మార్గంలో 106 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పాల్వంచ కేసులో ఒక పిస్తోలు, ఐదు రివాల్వర్లు, 40 బుల్లెట్లు, 12 ఖాళీ మ్యాగజైన్లను స్వాధీనం చేసుకున్నారు. రెండు ఘటనల్లోనూ గంజాయి అక్రమ రవాణాతో పాటు ఆయుధాల లభ్యతపై ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి స్మగ్లింగ్ ముఠాలకు ఆయుధాలు ఎలా అందుతున్నాయనే కోణంలో అధికారులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.
ఆయుధాలు లేకుండా దాడులకు వెళ్తున్న ఎక్సైజ్ సిబ్బంది భద్రతపై పలువురు ప్రశ్నలను లెవనెత్తుతున్నారు. ఎక్సైజ్ సిబ్బందికి ఆయుధాలు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. పోలీస్, ఎక్సైజ్, ఈగల్ టీమ్స్ సమన్వయంతో అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని పలువురు అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేశారు.

## మత్తు మందుల అక్రమ విక్రయాలపై టిజి సేఫ్ కొరడా

**హైదరాబాద్,అక్టోబరు24,ప్రభాతవార్త:** తెలంగాణలో మత్తు మందుల అక్రమ విక్రయాలపై టీజీ సేఫ్ కొరడా ఝుళిపించింది. హైదరాబాద్ క్యూర్ పరిధిలో పలు ప్రాంతాల్లో మెడికల్ షాపులపై అధికారులు శనివారం మెరుపు దాడులు నిర్వహించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులతో కలిసి డ్రగ్స్ వింగ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. గాజులరామారం, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, కాప్రా, హబ్సిగూడ, ఉప్పల్‌లో సోదాలు చేశారు. జీడిమెట్ల, బాలానగర్, మేడిపల్లి, షామీర్‌పేట్ జోన్లలోనూ రైడ్స్ నిర్వహించారు.
ఈ నేపథ్యంలో హానికరమైన మాత్రల విక్రయాలపై అధికారులు నిఘాపెట్టారు. పలు రకాల మందులపై తనిఖీలు చేపట్టారు. ఆయా మందుల అక్రమ విక్రయాలపై ఆరా తీశారు. ఈ సోదాల్లో నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన 125 మెడికల్ షాపులను అధికారులు గుర్తించారు. సంబంధిత మెడికల్ షాపులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. లైసెన్సుల సస్పెన్షన్ లేదా రద్దుకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలంగాణలోని ఇతర జిల్లాల్లోనూ ప్రత్యేక తనిఖీలు కొనసాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.

## పులుల సంరక్షణకు 'గ్రేహౌండ్స్'!

>> పులుల సంరక్షణ, అటవీ రక్షణకు అటవీశాఖ అధికారులతో పాటు ఎనిమల్ ట్రాకర్స్, బేస్ క్యాంపు సిబ్బంది పని చేస్తున్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో పులుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. 25 నుంచి 36గా ఉన్న పులుల సంఖ్య చేరి తాజా గణనలో 42కి పెరిగినట్టు తేలింది. అటవీశాఖ ప్రాథమిక విశ్లేషణ ప్రకారం అమ్రాబాద్ రిజర్వ్ ఫారెస్ట్‌లో 18 ఆడ పులులు, 14 మగ, రెండు ఉపవయోజన పులులు, ఎనిమిది పిల్లలు ఉన్నట్టు గుర్తించారు. పిల్లలు, యుక్తవయస్సు పులులు ఉండటం అనేది విజయవంతమైన సంతానోత్పత్తికి, రిజర్వ్‌లో ఆరోగ్యకరమైన, సంతానోత్పత్తి సామర్థం కలిగిన పులుల సమూహం ఉందనడానికి సంకేతంగా అధికారులు సంతృప్తి చెందుతున్నారు. మొత్తం ఎనిమిది పులి పిల్లలను గుర్తించారు. రిజర్వ్‌లో మగ పులులకంటే ఆడ పులులే ఎకువగా ఉండటం మంచి పరిణామం అన్నారు. కవ్వాల్‌లో తాడోబా నుంచి పులి వచ్చి మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో సంచరిస్తున్నాయి. నిర్మల్ మంచిర్యాల మీదుగా ఆర్మూర్, జగిత్యాల జిల్లా కొడిమ్యాల, సిరిసిల్ల కామారెడ్డి నిజామాబాద్ జయశంకర్‌భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల్లోకి కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం నుంచి దారి తప్పి వస్తున్నాయి. తాడోబా తిప్పేశ్వర్ ప్రాంతాల నుంచి పది నుంచి 15 పులులు వస్తుపోతూ ఉంటాయని అటవీశాఖ అధికారులు అంటున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ఐదు పులులు క్రమం తప్పకుండా సంచరిస్తున్నాయి. ముఖ్యంగా పత్తి ఏరే కాలంలో అవి ఎక్కువగా రైతులపై దాడులు చేస్తూ ఉంటాయి కూడా. అదిలాబాద్ అడవుల్లో జీవవైధ్యంతో పాటు విలువైన టేకు, సండ్ర, మద్ది వంటి అనేక రకాలు వృక్షాలు ఉన్నాయి. జన్నారం టేకుకు డిమాండ్ అధికంగా ఉంటుంది. అయితే ఇక్కడికి వలస వస్తున్న పెద్దపులులు తిరిగి వెళ్లిపోతున్నాయి. దీనికి కారణం అటవీ ప్రాంతంలో గ్రామాలు ఉండటమేనని అటవీ శాఖ భావిస్తోంది. మరో పక్క కవ్వాల్లో సంచరించే పులులకు రక్షణ కొరవడినట్లు తెలుస్తోంది. తెలంగాణ నక్సల్‌రహిత ప్రాంతంగా దక్షిణాదిడిజిపి సమావేశంలో అధికారికంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో గ్రేహౌండ్స్ బృందాలను టైగర్ ప్రొటెక్షన్ బృందంలో నియమించాలని యోచిస్తున్నారు. ఈ ప్రతిపాదనలపై ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లభించింది. పులుల సంరక్షణ లో అడవులు దట్టంగా ఉండటం, పులులకు సరిపడా ఆహారంగా ఉపయోగపడే శాకాహార జంతువులు ఉండటం, నీటి లభ్యత, వేట నిరోధక చర్యలు, మానవ సంచారం వల్ల కలిగే ఇబ్బందుల తగ్గింపు కీలకం. అమ్రాబాద్లో చెంచు గిరిజనులు, కవ్వాల్లో ఆదివాసీ గిరిజనుల భాగస్వామ్యంతో పులలను సంరక్షణ చేయాలని యోచిస్తున్నారు.

## వారం - వర్జ్యం

25-10-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆశ్వీయుజ మాసం, దక్షిణాయణం,
శరదృతువు, శుక్లపక్షం, స్వాతి కార్తె
తి. చతుర్దశి ఉ.11.52
న. రేవతి రా.7.17
వ. ఉ.7.52-ఉ.9.23
దు. సా.4.03-సా.4.50
రాహు సా.4.30-సా.6.00
శుభ లేదు

## వార్తాఫలం

**మేషం :** బంధువుల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు. విద్యార్థిని విద్యార్థులకు అవకాశాలు కలసి వస్తాయి.

**వృషభం :** పెట్టుబడులకు తగిన లాభాలు కష్టమే. భూముల క్రయవిక్రయాలలో శ్రమానంతర ప్రోత్సాహం లభిస్తుంది.

**మిథునం :** కుటుంబ సభ్యులతో వివాదాలు ఎదురై చికాకు పెడతాయి. వృత్తిలో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**కర్కాటకం :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. అవసరాలకు ఏదో విధంగా డబ్బు సర్దుబాటవుతుంది.

**సింహం :** ఎంతటి కార్యాన్నైనా పూర్తి చేయాలనే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతారు. వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**కన్య :** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం కొంత ఆశ్చర్యం కలిగిస్తుంది. ఉద్యోగులకు పదోన్నతులు పొందుతారు.

**తుల :** ముఖ్యమైన సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు. ఎదురు చూడని అవకాశాలు లభిస్తాయి. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు

**వృశ్చికం :** సన్నిహితులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. ఆస్తివివాదాలు తీరి లబ్ది పొందుతారు. ప్రయాణాలు.

**ధనుస్సు :** కీలకనిర్ణయాలలో జాప్యం చికాకు తెప్పిస్తాయి. ఎంతో కాలంగా మీ మాట వినని వారు కూడా మీ మాట వింటారు.

**మకరం :** ముందు చూపుతో అనేక కార్యక్రమాలు ఏకకాలంలో ప్రారంభిస్తారు. నూతన వస్తువులు, వాహనాలు కొనుగోలు చేస్తారు.

**కుంభం :** నామ మాత్రపు ఫలితాలు సాధిస్తారు. మీరు తెలుసుకున్న సమాచారంలో పొరపాటు జరుగుతుంది.

**మీనం :** కళా, సాంస్కృతిక కార్యక్రమాలకు, యోగ, ధ్యానములకు, ప్రయాణాలకు ఇది అనుకూలమైన కాలము.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'ఉపాధి'కి 8 నెలల కార్యాచరణ ప్రణాళిక

### 370 రకాల పనులను ప్రాధాన్యత క్రమంలో విభజించి లక్ష్యాల మేరకు పూర్తి చేయాలి: మంత్రి సీతక్క

**హైదరాబాద్,అక్టోబరు24,ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే నీటి ఎద్దడి, వ్యవసాయ రంగంలో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో పెట్టుకొని గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన, నీటి సంరక్షణ, శాశ్వత గ్రామీణ ఆస్తుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. వీబీజీ రామ్ జీ పథకం కింద అనుమతించిన 370 రకాల పనులను ప్రాధాన్యత క్రమంలో విభజించి, స్థానిక అవసరాలకు అనుగుణంగా దశలవారీగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అన్ని పనులను ఒకేసారి చేపట్టకుండా, ఏడాది పొడవునా కూలీలకు ఉపాధి లభించేలా ఎనిమిది నెలల కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో వీబీ జీ రామ్ జీ పథకం అమలు, ఉపాధి హామీ పనుల పురోగతిపై మంత్రి సీతక్క శనివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, కమిషనర్ దివ్య దేవరాజన్, ఇంజినీర్‌ఇన్‌చీఫ్‌లు కృపాకర్ రెడ్డి, జగదీశ్వర్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీఆర్డీఓలు, ఈఈలు, డీఈలు, ఎంపీడీవోలు సమీక్షలో పాల్గొన్నారు. ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచని డీఆర్డీఓలపై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతి కనిపించాలని, కేవలం సమాధానాలు చెప్పి తప్పించుకోవడం సరికాదని స్పష్టం చేశారు. అర్హులైన వారికి జాబ్ కార్డులు జారీ చేయడంలో జాప్యం చేస్తే ఎంపీడీవోలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అక్టోబర్ 30వ తేదీ నాటికి మండలస్థాయి సమన్వయ కమిటీల ఆధ్వర్యంలో పనుల ప్రణాళికలను పూర్తి చేయాలని, నవంబర్ 1 నుంచి ఉపాధి హామీ పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి కార్యాచరణ ప్రణాళికను సమీక్షించి, తదుపరి పనులను గుర్తించాలని సూచించారు. పథకంలో అనుమతించిన 370 రకాల పనులను ఒకేసారి చేపట్టకుండా, స్థానిక అవసరాలు, వాతావరణ పరిస్థితులు, కూలీల లభ్యత ఆధారంగా ప్రాధాన్యత క్రమంలో విభజించాలన్నారు. గుర్తించిన 318 రకాల పనుల్లో గ్రామాల అవసరాలకు అనుగుణంగా కనీసం 50 రకాల ముఖ్యమైన పనులకు ప్రాధాన్యతనిచ్చి, నిర్దేశించిన లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని సూచించారు. సీజన్లు, నెలలు, ప్రాంతాల వారీగా పనులను, పని దినాలను విభజించి పక్కా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత తలెత్తే అవకాశమున్నందున నీటి సంరక్షణ పనులను ప్రాధాన్యతగా చేపట్టాలని మంత్రి సీతక్క సూచించారు. ఉపాధి హామీ పనులు కేవలం తాత్కాలిక ఉపాధి కల్పనకే పరిమితం కాకుండా, గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చే శాశ్వత ఆస్తుల నిర్మాణానికి దోహదపడాలని మంత్రి పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి, ఉపాధి కల్పన, నీటి భద్రత అనే మూడు అంశాలను సమన్వయం చేసుకొని పనులను ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. ఎల్‌నినో కారణంగా నీటి లభ్యత తగ్గే పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులను సిద్ధం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. రెండో పంటగా అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. అవసరమైతే గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. చిన్న, సన్నకారు రైతులు కూడా ఉపాధి హామీ పనుల వైపు వచ్చే అవకాశం ఉందని, వారి అవసరాలకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని సూచించారు. వ్యవసాయ పనులు లేని సమయాల్లో గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించేలా పనుల క్యాలెండర్ రూపొందించాలని తెలిపారు. ఉపాధి హామీ పనుల ఎంపిక, ప్రణాళిక, అమలులో సర్పంచులను భాగస్వాములను చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు.
గ్రామసభలు, స్థానిక అవసరాల ఆధారంగా పనులను గుర్తించి, మండల సమన్వయ కమిటీల ద్వారా వాటికి ప్రాధాన్యత కేటాయించాలని సూచించారు. పనుల ఎంపిక నుంచి అమలు, పురోగతి సమీక్ష వరకు ప్రతి దశకు స్పష్టమైన కాలపరిమితి ఉండాలని, నిర్దేశించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు సమీక్షి ంచాలని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పనులు సకాలంలో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రత్యేక అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఉపాధి పనులను మరింత విస్తరించాలని మంత్రి సీతక్క సూచించారు. ఐటీడీఏల పరిధిలో 7 శాతం వర్క్ షేర్‌కు అనుగుణంగా పనులను గుర్తించి అమలు చేయాలని ఆదేశించారు.
అర్హులైన ఆదివాసి, గిరిజనులు జాబ్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే, జాబ్ కార్డు మంజూరు చేయాలని, కార్యాలయాల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేయవద్దని స్పష్టం చేశారు. అర్హులైన గిరిజనుల జాబ్ కార్డు దరఖాస్తులను అనవసరంగా తిరస్కరించినా, జారీ చేయడంలో నిరక్ష ్యం వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## అది కమీషన్ల కాళేశ్వరం

>> దింపి దివాళా తీయించారని ఆవేదన చెందారు. తెలంగాణ రైతాంగం ఇబ్బందులకు కారణమై ఉల్టాచోర్ కొత్వాల్‌కో డాంటే అన్నట్లు నిందలు వేస్తున్నారని దుయ్యబట్టారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వైఫల్యాలను కప్పిపుచ్చు కుంటూ, ఎల్‌నినో పరిస్థితులను సైతం రాజకీయ ప్రయోజనాలకు వాడుకునేందుకు బిఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కెసిఆర్, కెటిఆర్ హరీశ్‌రావు చేస్తున్న ప్రచారం జోసెఫ్ గోబెల్స్‌ను మించిపోయిందని విరుచుకుపడ్డారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, ఎస్ఎల్‌బిసి, సీతారామ తదితర ప్రాజెక్టులను పూర్తిచేసి ఉంటే ప్రస్తుత కరువు పరిస్థితుల్లో రైతుల కష్టాలు తగ్గేవని పేర్కొన్నారు. మూడు బ్యారేజీలను వినియోగించకుండానే తమ ప్రభుత్వం రికార్డు స్థాయిలో వరి సాగు, ధాన్యం కొనుగోళ్లు సాధించిందని తెలిపారు. పదేళ్లలో ప్రాజెక్టులు పూర్తిచేసి ఉంటే రైతులపై కరువు దెబ్బ తగ్గేది అన్నారు. తమ ఘోర వైఫల్యాలను దాచేందుకే ఇప్పుడు నాటకాలు ఆడుతున్నారని ఎల్‌నినో పరిస్థితులను కూడా తమకు అనుకూలంగా మలుచుకునేందుకు బిఆర్ఎస్ విన్యాసాలని అన్నారు. మేడిగడ్డలో డిజైన్, నిర్మాణం, నిర్వహణ లోపాలను గత ప్రభుత్వ హయాంలోనే ఎన్‌డిఎస్‌ఏ గుర్తించిందనీ మంత్రి ఉత్తమ్ వివరించారు. పేలవమైన డిజైన్.. పేలవమైన నిర్మాణం.. మూడు బ్యారేజీల దుస్థితికి గత ప్రభుత్వ వైఫల్యాలే కారణమనీ ఆయన అభిప్రాయపడ్డారు. బ్యారేజీల డిజైన్, నిర్మాణ వైఫల్యాలను సాంకేతిక, న్యాయ విచారణలు, విజిలెన్స్ నివేదికలు స్పష్టం చేశాయనీ తమ హయాంలో జరిగిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు తెలంగాణ రైతాంగాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారనీ ఆరోపించారు. ప్రాణహిత-చేవెళ్ల, దేవాదుల తదితర ప్రాజెక్టులు పూర్తిచేసి ఉంటే కరువు పరిస్థితులను మరింత సమర్థంగా ఎదుర్కొనేవాళ్లమనీ చెప్పారు. పాలమూరు, సీతారామ ప్రాజెక్టులతో ఎన్ని ఎకరాలకు నీరిచ్చారు?.. ఎస్ఎల్‌బిసి సొరంగాన్ని ఎందుకు పూర్తిచేయలేదు?: మంత్రి ఉత్తమ్ ప్రశ్నించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును మార్చి తెలంగాణ రైతాంగానికి తీవ్ర అన్యాయం చేశారనీ దుయ్యబట్టారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నిరుపయోగంగా ఉన్నా రికార్డు వరి సాగు, ధాన్యం కొనుగోళ్లు సాధించామనీ మూడు బ్యారేజీలను వినియోగించకుండానే గోదావరి బేసిన్‌లో రికార్డు స్థాయిలో సాగునీరు అందించామనీ అన్నారు. మా రెండున్నరేళ్ల పాలనలో కృష్ణా, గోదావరి బేసిన్లలో సాగు విస్తీర్ణం, పంట ఉత్పత్తి పెరిగాయనీగణాంకాలతో వివరించారు. భట్టి విక్రమార్క నేతృత్వంలో వరి సాగు, ధాన్యం కొనుగోళ్లలో రికార్డులు నమోదయ్యాయి బ్యారేజీల గేట్లు ఎత్తి ఉంచాలని డ్యామ్ సేఫ్టీ అథారిటీ లిఖితపూర్వకంగా సూచించిందనీ మంత్రి ఉత్తమ్‌తెలిపారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పునరుద్ధరణకు దేశీయ, అంతర్జాతీయ నిపుణుల సలహాలతో ముందుకెళ్తున్నామనీ తెలిపారు. మూడు బ్యారేజీల పునరుద్ధరణకు నిపుణుల ఆధ్వర్యంలో డిజైన్ల రూపకల్పన జరుగుతోందని వివరించారు. బ్యారేజీల పునరుద్ధరణలో రాజకీయ దురుద్దేశం లేదు.. చిత్తశుద్ధితో పనిచేస్తున్నామనీ గత ప్రభుత్వ ఘోర వైఫల్యాలను కప్పిపుచ్చే ప్రచారం వెనుక వాస్తవాలను తెలంగాణ రైతాంగం గమనించాలనీ కోరారు. సమావేశంలో మంత్రి జి. వివేక్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ రెడ్డి, బాలు నాయక్, మందుల సామ్యేల్, సంజీవ్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ సలహాదారు పరిక్షిత్ మెహ్రా, ఈఎన్‌సీ రమేష్‌బాబు తదితర అధికారులు పాల్గొన్నారు.



హిమాచల్‌లోని కులూలో నిర్వహించిన ఊరేగింపులో సాంప్రదాయ వాద్యాలతో కళాకారులు

## పరిశోధనల్లో హైదరాబాద్ అగ్రగామి

>> బీడీఎల్, మిథాని, టాటా సంస్థలు, ఎయిర్‌బస్, సాఫ్రాన్, స్కైరూట్, లాక్‌హీడ్ మార్టిన్, భారత్ ఫోర్జ్ వంటి ఎన్నో ప్రముఖ సంస్థల ప్రతినిధులు మన మధ్య ఉన్నారని చెప్పారు. భారతదేశంలో హైదరాబాద్ ఒక వ్యూహాత్మకమైన ప్రదేశంగా కీలకమైన స్థానంలో ఉందని, హైదరాబాద్ అత్యంత సురక్షితమైన నగరం. అనేక ముఖ్యమైన పరిశోధనా సంస్థలకు నిలయం అని చెప్పారు. భారత సైన్యం, భారత వైమానిక దళాలకు సంబందించిన అనేక ముఖ్యమైన స్ట్రాటజిక్ కేంద్రాలు ఇక్కడున్నాయని చెప్పారు. దక్షిణ భారతదేశంలో సముద్రతీరం లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ, అయినప్పటికీ భారత నౌకాదళానికి రాష్ట్రం కీలకమైన సేవలు అందిస్తోందని చెప్పారు. తెలంగాణలోని వికారాబాద్ జిల్లా దామగుండం రిజర్వ్ ఫారెస్ట్‌లో అత్యంత తక్కువ పౌన:పున్యాల(వెరీ లో ఫ్రీక్వెన్సీ-వీఎల్‌ఎఫ్) నౌకాదళ రాడార్ కేంద్రాన్ని నిర్మిస్తున్నారని చెప్పారు. ఈ రంగానికి ప్రతిభా వంతులైన యువత అవసరమన్నారు. అందుకు మనకు ఐఐటి, ఐఐఐటి, ఎన్ఐటి, ఎస్‌బి, బిట్స్ వంటి అత్యుత్తమ విద్యా సంస్థలు ఉన్నాయన్నారు. నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను సిద్ధం చేసేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని నిర్మిస్తున్నామన్నారు. ఐటిఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా తీర్చిదిద్దామని, విజయవంతంగా పనిచేస్తున్న ఇంక్యుబేటర్లు కూడా ఇక్కడ ఉన్నాయన్నారు. రక్షణ రంగంలో ప్రపంచ స్థాయిలో అగ్రగామిగా భారత దేశాన్ని చూడాలన్నది నా ఆకాంక్ష అని చెప్పారు. యుద్దానికి అవసరమైన సాంకేతికతను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి రక్షణ సాంకేతిక ఎగుమతులు చేసే దేశంగా భారత్ ఎదగాలన్నారు. యుద్ధం కోసమే కాకుండా, శాంతిని కాపాడేందుకు కూడా ఆయుధాలు అవసరమన్నారు. శత్రువులు యుద్దానికి దిగకుండా నిరోధించే శక్తి కూడా మనకు ఒక వ్యూహాత్మక ఆధిక్యాన్ని అందిస్తుందన్నారు. ఈ దార్శనికతను సాకారం చేసేందుకు తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే పెద్ద ఎత్తున కృషి చేస్తుందన్నారు. అయితే అందుకు అందరూ మరింతగా సహకారాన్ని అందించి మరిన్ని విజయాలు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. భారత దేశ రక్షణ పరిశ్రమకు తెలంగాణ అతిపెద్ద పారిశ్రామిక కేంద్రంగా ఎదగాలన్నారు. రక్షణ రంగంతో పాటు స్పేస్, ఏరోస్పేస్, సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేధస్సు, డ్రోన్ టెక్నాలజీ వంటి అనేక అనుబంధ రంగాల్లో ఈ సమావేశానికి హాజరైన వారందరూ సహకరించి లక్ష్యాన్ని సాకారం చేయాలని కోరారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని వేసుకున్న ప్రణాళికలను రెట్టింపు చేయాలని, లక్ష్యాన్ని సాధించడానికి మీకు ఎలాంటి సహకారం కావాలో చెప్పండి అందిస్తానన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం నాకొక స్పష్టమైన దార్శనికత ఉందని ఈ లక్ష్యాన్ని సాధించడంలో తెలంగాణ గణనీయమైన పాత్ర పోషిస్తుందన్నారు. భారతదేశ రక్షణ రంగ పరిశ్రమకు అతిపెద్ద పారిశ్రామిక కేంద్రంగా తెలంగాణ ఎదగాలని, అందుకు మీ అందరి సహకారం కావాలని కోరారు. తెలంగాణ 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిద్దాలన్న లక్ష్యంతో గత ఏడాది తెలంగాణ రైజింగ్ విజన్ 2047 డాక్యుమెంట్ విడుదల చేశామని చెప్పారు. 2047 నాటికి దేశ జిడిపిలో తెలంగాణ వాటా 10శాతంగా సాధించాలన్నదే నా లక్ష్యం, రాజకీయంగా భేదాభిప్రాయాలు ఉన్నా, పెట్టుబడుల విషయంలో లేవు అని చెప్పారు. త్వరలోనే ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ 2.0 విడుదల చేయబోతున్నాం, రక్షణ రంగంలో దేశాన్ని అగ్రగామి శక్తిగా తీర్చిదిద్దేందుకు కలిసి పనిచేద్దాం అని సిఎం పిలుపునిచ్చారు.

## ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

>> ఓట్లను తొలగించి ఎన్నికల్లో గెలవాలని బీజేపీ కుట్ర పన్నుతోందని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించిన విషయం తెలిసిందే. ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో ఓటు హక్కు ఉన్నవారు, లేనివారు అంటూ రెండు రకాల పౌరులను సృష్టిస్తున్నారని, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలోనూ బీజేపీ ఇదే పద్ధతిని అనుసరించిందని ఆయన విమర్శించారు. ఈ ఆరోపణలపై రాంచందర్ రావు స్పందిస్తూ, "ఇప్పటివరకు ఒక్క ఓటరు కూడా తన ఓటు పోయిందని చెప్పలేదు. కానీ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి మాత్రమే వీధుల్లోకి వచ్చి ఓట్లు తొలగించారని అరుస్తున్నారు" అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి, ఆయన మంత్రులు తమ ఆరోపణలకు ఆధారాలు చూపించాలని సవాల్ విసిరారు. ఓట్ల తొలగింపు అంశంపై నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన నిరసనలో ఆ పార్టీ నేతలు పాల్గొంటుండడాన్ని రాంచందర్ రావు తప్పుబట్టారు. దీనికి ప్రతిగా, 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి అరాచకానికి వ్యతిరేకంగా పోరాడండి' అనే నినాదంతో బీజేపీ పాదయాత్రలు నిర్వహిస్తుందని ప్రకటించారు. నవంబర్ 1న హైదరాబాద్‌లో ఈ యాత్ర ప్రారంభమై, ఆ తర్వాత సిద్దిపేట, కరీంనగర్‌లో కొనసాగుతుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్, బీజేపీ మధ్య ఓటర్ల జాబితా సవరణ అంశం తీవ్ర రాజకీయ వివాదానికి దారితీసింది. భారీ ఎత్తున ఓట్లు తొలగించారని కాంగ్రెస్ ఆరోపిస్తుండగా, ఇది కేవలం నకిలీ, డూప్లికేట్, మరణించిన ఓటర్లను గుర్తించి తొలగించేందుకు ఎన్నికల సంఘం చేపట్టే సాధారణ ప్రక్రియేనని బీజేపీ వాదిస్తోంది.

## రేపు మహారాష్ట్ర సిఎం ఫడ్నవిస్‌తో సిఎం రేవంత్ భేటీ

### తుమ్మిడిహెట్టిపై చర్చలు

### సిఎంతో పాటు మంత్రి ఉత్తమ్, అధికారులు

**హైదరాబాద్,అక్టోబరు24,ప్రభాతవార్త:** తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు ముహూర్తం ఖరారైంది. సోమవారం ఉదయం 11 గంటలకు ముంబయిలో చర్చలు జరగనున్నాయి. ఇందుకోసం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్, నీటిపారుదల అధికారులు ఆదివారం సాయంత్రమే ముంబయి వెళ్లనున్నారు. తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో సిఎం రేవంత్‌రెడ్డి భేటీ కానున్నారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొనున్నారు. మరోవైపు సోమవారం జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా పడింది. అదేరోజు ముంబయిలో మహారాష్ట్ర సీఎంతో రేవంత్‌రెడ్డి సమావేశం ఉన్నందున వాయిదా వేయాలని తెలంగాణ కోరింది. ఈ విజ్ఞప్తిపై స్పందించిన కేఆర్ఎంబీ సమావేశాన్ని వాయిదా వేశారు. సోమవారం జరగాల్సిన కృష్ణా బోర్డు సమావేశం మంగళవారానికి వాయిదా వేసింది. సాగునీటి ప్రాజెక్టులపై ఒక రోజు ముందే రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశంలో భాగంగా తుమ్మిడిహెట్టిపై ప్రధానంగా చర్చించారు. 152 మీటర్ల ఎత్తున తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి ఒప్పించేందుకు అవసరమైన పూర్తి వివరాలను సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. బ్యారేజీ ఎత్తుపై స్పష్టత వచ్చిన తర్వాత తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు నీటిని తెచ్చే ప్రాజెక్టు రూట్ డిజైన్లు, భూసేకరణపై దృష్టి సారించాలని ఇరిగేషన్ ఇంజినీర్లను సీఎం ఆదేశించారు. గతంలో 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించిందని, అయితే అంత తక్కువ ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే ఆశించినంత నీటిని తెచ్చుకొనే వీల్లేదని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే 152 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు సిద్ధమవుతోంది. అందుకు అవసరమైన సాంకేతిక నివేదికలు, నీటి లభ్యత, ముంపు విస్తీర్ణం, ఇతర అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధంగా ఉంచాలని ఇప్పటికే అధికారులకు సూచించారు. మహారాష్ట్రతో చర్చల సందర్భంగా తెలంగాణ నీటి అవసరాలు, వాదనలను సమర్థవంతంగా వివరించనున్నారు.

ఇక భారత డిజిటల్ సర్టిఫికెట్ సంస్థ ఈముద్ర ఉపయోగించిన ఎనిమిది ప్రైవేట్ కీలు అత్యంత బలహీనంగా ఉన్నట్లు సైబర్ పరిశోధకులు గుర్తించారు. ఒక్క బైట్‌తో సూచించగల సంఖ్యలుగా ఉన్న ఈ కీలను సెకనులోపే ఛేదించగలిగారు. ఇలాంటి లోపాలు నకిలీ సర్టిఫికెట్ల జారీకి, అసలైన వెబ్‌సైట్ల పేరుతో మోసాలకు దారితీయవచ్చని నిపుణులు చెబుతున్నారు. వినియోగదారులు బ్రౌజర్లు, ఆపరేటింగ్ సిస్టమ్‌లను అప్‌డేట్ చేసుకోవాలని నిపుణులు సూచించారు. ఏఐ టూల్స్ ద్వారా హ్యాకింగ్ దాడులకు అవకాశం వుందని వారు హెచ్చరించారు. మరోవైపు, ఏఐ సేవలకు అనుసంధానంగా పనిచేసే ఎల్‌ఐటిఈఎల్‌ఎల్‌ఎంలో హానికరమైన కోడ్‌ను చొప్పించినట్లు భద్రతా సంస్థ విజ్ వెల్లడించింది. దీనివల్ల డెవలపర్ల రహస్య సమాచా



రం, క్లౌడ్ ఆధారాలు, బ్రౌజర్ డేటా చోరీ అయ్యే ప్రమాదం వుందని వారు హెచ్చరించారు. క్లౌడ్ సంస్థ రైల్వేలోనూ వినియోగదారుల సున్నిత సమాచారం అనధికారవ్యక్తులకు చేరి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. వినియోగదారులు తమ ఏపీఐ కీలను, ఇతర రహస్య ఆధారాలను మార్చుకోవాలని సంస్థ సూచించింది. మరోవైపు చైనాతో సంబంధాలున్న హ్యాకింగ్ బృందం ఏఐఆధారిత టూల్‌ను ఉపయోగించి కనెక్ట్‌వైజ్ క్లౌడ్‌బ్యాకప్‌ద్వారా 2,250కిపైగా సంస్థల వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నట్లు మైక్రోసాఫ్ట్ పేర్కొంది. సంస్థలు అనుమానాస్పద లాగిన్‌లను పరిశీలించాలని, సంబంధిత కనెక్షన్లను నిలిపివేయాలని మైక్రోసాఫ్ట్

# సైబర్ నేరగాళ్లకు కార్పొరేట్ సంస్థలే టార్గెట్

**డి.మురళీధర్ అమర్‌నాథ్**

సైబర్ నేరగాళ్లు బరితెగించారు. నిన్నటివరకు చిన్నా చితక మోసాలకే పరిమితమవగా నేడు ఏకంగా బ్యాంకులను, బడా కార్పొరేట్ సంస్థలను టార్గెట్ చేస్తూ పదుల కోట్ల రూపాయల నుంచి వందల కోట్ల రూపాయల వరకు లూటీ చేసేందుకు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. నాలుగేళ్ల క్రితం హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న మహేష్ బ్యాంకులో సైబర్ నేరగాళ్లు ఏకంగా సర్వర్‌లో చొరబడి 12.90 కోట్ల రూపాయలను లూటీ చేసిన వైనం దేశవ్యాప్తంగా సంచలనం రేపగా అనంతరం నగరంలోని ప్రముఖ కార్పొరేట్ సంస్థ సిలికా సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు మరికొన్ని సంస్థల గేట్ వే పేమెంట్‌లో చొరబడి రెండు కోట్ల రూపాయలను దోచుకున్నారు. అంతకు ముందు బహెరెన్ బ్యాంకు, తెలంగాణ సహకార బ్యాంకుల సర్వర్లలో చొరబడి ఐదు కోట్ల రూపాయలకు పైగా కాజేశారు. తాజా విషయానికి వస్తే దేశంలోని ప్రముఖ జాతీయ బ్యాంకులు ఎస్‌బిఐ, బ్యాంక్ ఆఫ్ బరోడాల డేటాను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి డార్క్ వెబ్‌లో వుంచడం బ్యాంకుల్లో వున్న డిజిటల్ భద్రతను ప్రశ్నార్థకం చేసింది. ఈ ఘటనలకు తోడుగా సైబర్ నేరగాళ్లు ఆయా బ్యాంకుల అధికారులతో చేతులు కలిపి మ్యూల్ ఖాతాలను తెరిపిస్తూ ఏకంగా బ్యాంకుల్లోని నగదును కాజేస్తున్న ఉదంతాలూ పెరిగిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ తరహా నేరాల నివారణకు బ్యాంకుల్లో వున్న పాతకాలపు సర్వర్లను మార్చాలని, వెబ్‌సైట్ల రూపకల్పనలో కొత్త పద్దతులను ఎంచుకుని, పలు అంచల భద్రతను పాటించాలని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు. సైబర్ నేరగాళ్లు పోలీసు వ్యవస్థలతో పాటు బ్యాంకులు, బడా సంస్థలకు సరికొత్త సవాల్ విసురుతున్నారు. కంప్యూటర్ రంగంతోపాటు టెక్నాలజీ రంగంలో వచ్చిన మార్పులు, కొత్త హంగులను తమకు అనుకూలంగా మలచుకుని ఏకంగా వందల కోట్ల రూపాయల లూటీకి వ్యూహాలు రచిస్తున్నట్లు సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. 2024 జనవరి నెలలో నగరంలోని మహేష్ బ్యాంక్‌కు చెందిన ప్రధాన సర్వర్‌ను హ్యాక్ చేయడం ద్వారా నైజీరియాకు నేరగాళ్లు 12.90 కోట్ల రూపాయలను లూటీ చేయడం సంచలనం రేపింది. దేశంలో ఒక బ్యాంకు సర్వర్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి ఇంత నగదును లూటీ చేయడం ఇదే తొలిసారి. ఈ కేసులో కొందరు నేరగాళ్లు అరెస్టయినా అసలు నిందితులు ఇంకా పట్టుబడలేదు. మహేష్ బ్యాంకు లూటీకి పాల్పడ్డ సైబర్ నేరగాళ్లు నైజీరియాకు చెందిన వారుగా తేలగా వీరికి చైనా, రష్యాకు చెందిన బడాక్రిమినల్స్ సహకరించారని వెల్లడయ్యింది. ఈ బడా నేరగాళ్లకు ఢిల్లీ, ఝూర్కండ్, మహారాష్ట్ర, నాగాలాండ్, మణిపూర్, అస్సాం, బిహార్ రాష్ట్రాలకు




చెందిన సైబర్ కేటుగాళ్లు సహకరించారని తేలింది. మహేష్ బ్యాంకు నుంచి నిధులను కాజేసిన నేరగాళ్లు మొదట నగరంలోని మూడు బ్యాంకుల్లో అంతకు ముందే వ్యూహాత్మంగా తెరిచిన ఖాతాల్లోకి మళ్లించి ఆ తరువాత వాటిని ఢిల్లీ, ఝూర్కండ్, మహారాష్ట్ర, నాగాలాండ్, మణిపూర్, అస్సాం, బిహార్ రాష్ట్రాలలో గల పలు బ్యాంకుల్లో ముందుగానే తెరిచిన 128 ఖాతాల్లోకి మళ్లించుకున్నట్లు, దీని తరువాత వీటిని మరో 200 ఖాతాల్లోకి మళ్లించి, ఆనక ఈ నగదును ఢిల్లీ, ముంబాయి నగరాలలో ఎటిఎంల నుంచి గంటల వ్యవధిలో కాజేశారు. మొత్తం మీద మహేష్ బ్యాంకు నిధులు 328 ఖాతాల్లోకి వెళ్లినట్లు తేలగా ఈ ఖాతాదారుల్లో కొందరు పత్తా లేకుండా పోగా కొందరిని పోలీసులు అరెస్టుచేశారు. ఇందులో 80శాతం మంది ఈశాన్య రాష్ట్రాలకు చెందిన వారే కావడంతో వీరందరిని విచారించడం పోలీసులకు తలకుమించిన పనిగా మారింది. ఈ ఘటనకు ముందు బహెరెన్ బ్యాంకు, తెలంగాణ సహకార బ్యాంకుల సర్వర్లలోనూ సైబర్ నేరగాళ్లు చొరబడి ఐదు కోట్లరూపాయలకు పైగా లూటీ చేశారు. దీని తరువాత వెలుగు చూసిన మరో బడా సైబర్ నేరం గురించి పరిశీలిస్తే విజయవాడకు చెందిన శ్రీరాం దినేష్ అనే మహా ముదురు సైబర్ నేరగాడు బడా వ్యాపార సంస్థలు నగదు మార్పిడికి ఆన్‌లైన్‌లో వినియోగించే పేమెంట్ గేట్ వే (పిజి) అనే ప్రక్రియను టార్గెట్ చేసుకుని రెండు కోట్ల రూపాయలకు పైగా లూటీ చేశాడు. ఏడాదికి పైగా రెండు సంస్థల పిజిలను టార్గెట్ చేసివాటిలో అక్రమంగా ప్రవేశించి అందినంతా దండుకున్నాడు. తన నేరాలు ఎక్కడా బయటకు రాకుండా వుండేందుకు తప్పుడు పత్రాలతో సింకార్డులు, ఆధార్ కార్డులు, ఇతర గుర్తింపు కార్డులు తయారు చేసిన సెకంట్ హ్యాండ్ ఫోన్ కొనే దగ్గర సదరు దుకాణాదారుడికి పెటిఎం ద్వారా నగదు బదిలీ చేసి చివరకు పోలీసులకు దొరికిపోయాడు. దీని తరువాత ఇతగాడిని విచారించగా పిజిల్లో వున్న లోపాలు, వీటి ద్వారా ఎలా నగదు లూటీ చేయవచ్చనేది తెలియడంతో పోలీసులు, సైబర్ నిపుణులు సైతంషాక్‌కు గురయ్యారు. ఈ రెండు ఘటనలు బ్యాంకులు, బడా సంస్థలు తమ అంతర్గత భద్రతను మరింత సురక్షితంగా తయారు చేసుకోవాల్సిన అవశ్యతను తేల్చి చెప్పింది. ఇక కొన్నేళ్లుగా సైబర్ నేరగాళ్లు బ్యాంకులను టార్గెట్ చేస్తుండడం తెలిసిందే. ఈ క్రమంలో బ్యాంకుల్లోని అధికారులను ఇతర సిబ్బందిని తమకు అనుకూలంగావుండేలా చేసుకుని అందులోని నగదును కాజేస్తున్నారు. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న మ్యూల్ ఖాతాదారులకు కొందరు బ్యాంకు అధికారులు సహాయం అందిస్తున్న వైనం పోలీసులను షాక్‌కు గురిచేస్తోంది. 2024 ఆగస్టులో నగరంలోని షంషీర్‌గంజ్ ఎస్‌బిఐలో వెలుగు చూసిన 175 కోట్ల రూపాయల అక్రమ లావాదేవీల్లో బ్యాంకు మేనేజర్‌తో పాటు పూర్వపు మేనేజర్ అరెస్టవడం దేశవ్యాప్తంగా సంచలనంరేపగా దీని తరువాత ఆయా రాష్ట్రాల సైబర్ క్రైం పోలీసులు దేశవ్యాప్తంగా దాడులుచేసి పదిబ్యాంకులకు చెందిన 32మందిని అరెస్టు చేయగా ఇందులో నాలుగు జాతీయ బ్యాంకులకు చెందిన 15 మంది అధికారులున్నారు. రెండు నెలల స్వల్ప వ్యవధిలో సైబర్ నేరగాళ్లు జాతీయ బ్యాంకుల నుంచి భారీగా లూటీ చేయడం గమనార్హం. ఈఘటనల్లో 20మందిబ్యాంకుల అధికారులు అరెస్టవగా వీరి సహాయంతో నేరగాళ్లు ఏకంగా 250కోట్ల రూపాయలను దోచుకున్నారు. బ్యాంకుల్లో రోజువారి కార్యకలాపాలను ఉన్నతాధికారులు పరిశీలించడం లేదని ఈఘటనలు చెబుతున్నాయి. కోట్లాదిరూపాయల ప్రజాధనాన్ని నేరగాళ్లకు బంగారు పళ్లెంలో పెట్టి ఇస్తున్న బ్యాంకుల అధికారులపై నిఘావుంచడంలో బ్యాంకింగ్ విజి లెన్స్ విభాగంతో పాటు ఇతర వ్యవస్థలు విఫలమయ్యాయని పోలీసుశాఖ ఆర్‌బిఐకి ఫిర్యాదు చేసింది. తాజా విషయానికి వస్తే దేశంలో ప్రముఖ జాతీయ బ్యాంకులుగా పేరొందిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ), బ్యాంక్ ఆఫ్ బరోడాలపై జరిగిన భారీ సైబర్‌దాడిపై విచారిస్తున్న సైబర్ నిపుణులు సంచలన విషయాలను వెలుగులోకి తెచ్చారు. ఎస్‌బిఐ, బ్యాంక్ ఆఫ్ బరోడాసహా అనేక కార్పొరేట్ సంస్థలు తమ డిజిటల్ అవసరాలకు వాడుతున్న పీహెచ్‌పీలో ప్రమాదకర లోపాలున్నట్లు నిపుణులు గుర్తించారు. వీటిని కృత్రిమ మేధస్సుతో పనిచేసే ఆంథ్రోపిక్ గుర్తించడం గమనార్హం. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యం లో వున్న ఈముద్ర సెక్యూరిటీ కీల్లో బలహీనతలు సైబర్ నేరగాళ్లకు వరంగా మారాయని సైబర్ నిపుణులు చెబుతున్నా రు. వీటిని సైబర్ నేరగాళ్లు తమకు అనువుగా మార్చుకునిఏఐ టూల్స్ ద్వారా హ్యాకింగ్ దాడులు చేస్తున్నట్లు సైబర్‌నిపుణులు చెబుతున్నారు. ఈక్రమంలోనే ఎస్‌బీఐకి చెందిన 3,897మంది కస్టమర్ల రికార్డులు, బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన వేలాది కస్టమర్ల డేటా బహిర్గతమైనట్లు వారు చెబుతున్నారు. ప్రపంచంలోని దాదాపు 70శాతం వెబ్ సైట్లు పీహెచ్‌పీని ఉపయోగిస్తున్నట్లు సైబర్ నిపుణులు చెబుతున్నారు. డబ్ల్యూ3టెక్ ఈ ప్రోగ్రామింగ్ భాషలో గుర్తించిన రెండు కీలక లోపాల ను పీహెచ్‌పీ 2 షెల్‌గా సైబర్ నిపుణులు చెబుతున్నారు. వీటి ద్వారా హ్యాకర్లు కలక వెబ్ సర్వర్లపై నియంత్రణ సాధించే ప్రమాదం వుందని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో అమెరికాసహా పలు యూరప్ దేశాలు సైబర్ భద్రత విషయమై అత్యవసర భేటీలు నిర్వహించి ముందస్తు చర్యలకు దిగాయని నిపుణులు వెల్లడించారు. ●

# 'చే'యూత లేదా?

ఉత్తర ప్రదేశ్

**ఎ.వి.వి ప్రసాద్**

నాలుగైదు నెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల కోసం ఉత్తర ప్రదేశ్‌లోని రాజకీయ పార్టీలన్నీ కత్తులు నూరుతున్నాయి. వరుసగా మూడోసారి అధికారంలోకి రావాలని యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలోని బిజెపిఉవ్విళ్లూరుతుండగా, దేశవ్యాప్తంగా పెరుగుతున్న ప్రజాదరణను దృష్టిలో ఉంచుకుని ఎలాగైనా అధికారంలోకి రావాలని కాంగ్రెస్ ఆరాటపడుతోంది. అయితే కాంగ్రెస్ ఒంటరిగా అధికారంలోకి రాగలదా? అన్నది మిలియన్ డాలర్ ప్రశ్న. 1989 వరకు యుపి అంటే కాంగ్రెస్‌కు కంచుకోట. ఆ పార్టీ తరఫున అనామకుడు పోటీ చేసినా గెలుస్తాడనే నమ్మకం ప్రబలిన దశలో అక్కడ ఒక్కసారిగా పరిస్థితి తారుమారయింది. ఆ తర్వాత మళ్లీ చక్రం తిప్పలేకపోయింది. ఆ సంవత్సరం కాంగ్రెస్ అధికారం కోల్పోయేనాటికి 18 శాతం ఓట్లు ఉండగా, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో అది 2.3శాతానికి పడిపోయిందంటే పార్టీ ఎంత నామమాత్రంగా మిగిలిందో అర్థమవుతుంది. ఈ గడ్డు పరిస్థితి నుంచి యుపిలోనైనా పార్టీని గట్టెక్కించాలనేది రాహుల్ గాంధీ తాపత్రయం. ఢిల్లీలోను, దేశంలోని ఇతర రాష్ట్రాలలోను కాంగ్రెస్ గత నెల రోజులుగా పెద్ద ఎత్తునే ఆందోళనలు జరుపుతోంది. 'సర్'కు వ్యతిరేకంగా, మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ జరుపుతున్న ఈ ఆందోళనలు పార్టీ మైలేజిని ఎంతో కొంత పెంచాయనే చెప్పాలి. ఆ వేడి చల్లారకుండా జరిగే యుపి సహా నాలుగు రాష్ట్రాల ఎన్నికల్లో ఎంతో కొంత లబ్ధిపొందాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఏ కంచు కోటలో అడ్రస్ వెతుక్కోవలసిన పరిస్థితి ఏర్పడిందో, అక్కడేతిరిగి విజయ పతాకం ఎగరేయాలని కాంగ్రెస్ వాంఛిస్తోంది. అయితే అందుకు తగిన ప్రయత్నాలు జరిపే సామర్థ్యంతో ఉన్నదా? అన్నది మరోప్రశ్న. కాంగ్రెస్ తర్వాత సమాజ్ వాదీ పార్టీకి, బిఎస్పీకి కూడా ఒక దశలో యుపి కంచుకోటగామారింది. అయితే తిరిగి కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్లకుండా రెండు పర్యాయాలుగా బిజెపి కాషాయ జెండా ఎగురుతోంది. సంప్రదాయంగా వస్తున్న రాయ్ బరేలి, అమేధి నియోజకవర్గాలు కూడా 'చేయి' దాటడంతో ఇప్పుడు కాంగ్రెస్ దిక్కుతోచని స్థితిలో పడింది. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ, రాహుల్ ఇలా.. నెహ్రూ కుటుంబంలోని ముఖ్యులందరిని ఆ రెండు నియోజకవర్గాలు కొన్ని దశాబ్దాలుగా అక్కున చేర్చుకొంటున్నాయి. కానీ గత అసెంబ్లీ ఎన్నికల నుంచి ఆ పరిస్థితిలో కూడా చాలామార్పు వచ్చింది. ఐదు సార్లు రాయ్‌బరేలి నుంచి లోక్‌సభకు ఎన్నికైన సోనియా గాంధీ ఇప్పుడు రాజ్యసభకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రాయ్ బరేలి నుంచి రాహుల్ ఎన్నికయ్యారు కానీ ఆ లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలలో ఒక్కచోటకూడా కాంగ్రెస్‌కు అడ్రస్ లేకపోవడం గమనించవలసిన అంశం. 2024లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌సమాజ్‌వాదీ పార్టీతో పొత్తుపెట్టుకొని 17 స్థానాల్లోపోటీ చేయగా, కేవలంఆరుచోట్ల గెలిచింది. వాటిలోనే



రాహుల్ గాంధీ

రాహుల్ రాయ్ బరేలి ఉంది. కేరళంలోని వయనాడ్ నుంచి కూడా ఆయన గెలిచినా, తర్వాత ఆ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో సోదరి ప్రియాంక గాంధీ విజయంసాధించారు. ఇందిరా గాంధీ కుటుంబం నుంచి ఉత్తరప్రదేశ్‌లోప్రస్తుతం రాహుల్ ఒక్కరే లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇలా ఒకప్పటి కాంగ్రెస్ కంచుకోట ఇందిర కుటుంబానికి కూడా దూరమైపోయింది. అమేధీ నుంచి రాజీవ్ గాంధీనాలుగు సార్లు విజయం సాధించినా, తర్వాత సోనియా గాంధీకూడా ప్రాతినిధ్యం వహించినా, ఇప్పుడు ఆ నియోజకవర్గంనుంచి ఇందిర కుటుంబీకులు గానీ, కాంగ్రెస్ ప్రతినిధులు గానీ కరవయ్యారంటే పరిస్థితి ఎంతగా క్షీణించిందో అర్థమవుతుంది. ఎమర్జెన్సీ అనంతరం జరిగిన ఎన్నికల్లో ఒక్కసారిమాత్రమే రాయ్ బరేలిలో ఇందిరాగాంధీ ఓడిపోయారు. అయినా ఆ రెండు నియోజక వర్గాలలో కాంగ్రెస్ ఆధిక్యత చాలాకాలం కొనసాగుతూ వచ్చింది. రాయ్ బరేలి నుంచి లోక్‌సభకు రాహుల్ మళ్లీ గెలవొచ్చు కానీ అసెంబ్లీకి గెలిచే వారే కరువయ్యారు. ఆ నియోజకవర్గం లోని ఐదు అసెంబ్లీ స్థానాల్లో ఒక్కటి కూడా కాంగ్రెస్ చేతిలో లేవు. నాలుగు చోట్ల సమాజ్ వాదీపార్టీ, రాయ్ బరేలి అసెంబ్లీ సీటునుంచి బిజెపిగెలిచాయి. అదేవిధంగా అమేథీ లోక్‌సభ పరిధిలోని ఐదు సీట్లలో ఒక్క చోట కూడా కాంగ్రెస్‌కు అడ్రస్ లేదు. మూడు చోట్ల బిజెపి, అమేథీ సహా రెండుచోట్ల ఎస్పీ గెలిచాయి. 2022 అసెంబ్లీ ఎన్నికల్లోఎస్పీ, కాంగ్రెస్ విడివిడిగా పోటీ చేశాయి. సీట్ల సర్దుబాటు కుదరకపోవడంతో కాంగ్రెస్ సింగిల్‌గా 399స్థానాల్లో పోటీచేసి రెండు సీట్లు మాత్రమే సాధించగలిగింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఇదిచాలా పెద్దదెబ్బ. తాజా ఎన్నికలకు ఎస్పీతో కలిసిపోటీ చేయడానికి కాంగ్రెస్ ముందుకు వచ్చింది కానీ సీట్లసర్దుబాటు పితలాటకం మళ్లీ మొదలయింది. గతవారం అఖిలేష్ యాదవ్‌తో ప్రియాంక రెండు సార్లు భేటీ అయ్యారుకానీ సీట్ల సర్దుబాటుపై ఏకాభిప్రాయం కుదరలేదని తెలుస్తోంది. తనకు కనీసం 172సీట్లు ఇవ్వాలని కాంగ్రెస్ పట్టుబడుతుండగా, 100కంటే ఇవ్వలేమని ఎస్పీఅంటోంది. దానితో కాంగ్రెస్ తనకు కావాల్సిన 172 సీట్లు, అభ్యర్థులను శుక్రవారం ప్రకటించింది. ఈ చర్య పట్ల ఎస్పీ ప్రస్తుతం ఆగ్రహంతో ఉంది. కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమిలో ఎస్పీ కూడా ఉన్నా, ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనల్లో అఖిలేష్ ఒక్కసారి మాత్రమే పాల్గొనడాన్నిచూస్తే ఆయన కూడా కాంగ్రెస్‌తో అంటీముట్టనట్లువ్యవహరిస్తున్నారనే విషయం స్పష్టమవుతుంది. రాష్ట్రంలోని సీట్ల సర్దుబాటులో కూడా అదే వైఖరి కనిపిస్తోంది. రాయ్ బరేలి, అమేథీ లోక్‌సభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు పట్టుఉన్నా అసెంబ్లీ సెగ్మెంట్లు 'చేయి'జారిపోయిన విషయం గుర్తుంచుకోవాలి. ఎస్పీతో పొత్తువిషయంలోవిఫలమైతే, గతంలో వచ్చిన రెండు సీట్లు కూడా ఈసారి అనుమానమే. రాబోయే రోజుల్లో పరిణామాలు కాంగ్రెస్‌ను ఎటు నడిపిస్తాయో చూడాలి. ●

# మళ్లీ వార్తల్లోకి కిమ్!

ఉత్తరకొరియా

**గన్ని మోహన్**

నియంత ఎలా ఉంటారనేందుకు ప్రతిరూపంగా చెప్పుకుంటున్న ఉత్తరకొరియా అధినేత కిమ్‌జాంగ్ ఉన్ మరోసారి మళ్లీ ప్రపంచ వార్తల్లోకి వచ్చారు. గడచిన కొద్దికాలంగా ఆయన బాహ్యప్రపంచానికి కనిపించకపోవడంతో కిమ్ తీవ్ర అనారోగ్యంతో ఉన్నారని కొంత, ఆయన వారసురాలిగా కుమార్తెను ప్రకటించేసారన్న వార్తలు చక్కర్లు కొట్టాయి. అలాగే సోదరి కూడా సెంట్రల్ కమిటీలో కీలకంగా వ్యవహరిస్తుండటంతో కిమ్‌జాంగ్ ఉన్ ఇకపై పాలనపరంగా కీలకంగా ఉండకపోవచ్చన్న వార్తలు వెలువడుతున్నాయి. మరోపక్క పక్కలో బల్లెంగా ఉన్న దక్షిణకొరియా ఎప్పటికప్పుడు నిఘా పెంచుతూ కిమ్ కుటుంబానికి సంబంధించిన ఏ చిన్న సమాచారం తెలిసినా వెనువెంటనే తన అధికారిక ఏజెన్సీలో విస్తృత ప్రచారం చేస్తోంది. వీటన్నిటికీ చెక్‌పెడుతూ ఉత్తరకొరియా అధినేత ఇటీవలే తన కుమార్తెతో కలిసి ఒక షాపింగ్ కాంప్లెక్స్‌లో కనిపించినట్లుఉత్తరకొరియా అధికారిక ఏజెన్సీ ప్రకటించడంతో కొంతమేర కిమ్ ఏమయ్యారన్న వార్తలకు చెక్‌పడింది. అయితే ఇప్పుడు తాజాగా కిమ్ తీవ్ర అనారోగ్యంతో ఉన్నారని, అందుకే బయటికి రాలేకపోతున్నారని, ప్రస్తుతం కోమాలో ఉన్నారంటూ సోషల్ మీడియాలో ప్రచారం వారసత్వంపైచర్చ ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌ఆరోగ్య పరిస్థితిపై మరోసారి ఊహాగానాలు మొదలయ్యాయి. ఆయనకు మెదడులో రక్తస్రావం జరిగి కోమాలోకి వెళ్లారంటూ సోషల్ మీడియాలో కొన్ని ధృవీకరించని కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. ఒకవేళ కిమ్ మరణిస్తే అణ్వాయుధాలు కలిగిన ఉత్తరకొరియా పగ్గాలు ఎవరు చేపడతారనే అంశంపై కూడా చర్చమొదలైంది. అత్యవసర చికిత్సకోసం చైనాకు వెళ్లారా కిమ్ జోంగ్ ఉన్‌కు ప్యాంగ్యాంగ్‌లో తగిన వైద్య సదుపాయాలు లేకపోవడంతో అత్యవసర చికిత్స కోసం బీజింగ్‌లోని పెకింగ్ యూనియన్ మెడికల్ కాలేజీకి తరలించారంటూ ప్రచారంజరుగుతోంది. ఈ వాదనలకు ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు బయటపడలేదు. ఆయన చైనాలో చికిత్స పొందుతున్నారన్న వార్తకూడా ధృవీకరణ కాలేదు. ఈ వారంలోనే ఆయన తన 13 ఏళ్ల కుమార్తె కిమ్ జుయే తో కలిసి ప్యాంగ్యాంగ్‌లోని ఒక రక్షణ రంగ మ్యూజియాన్ని సందర్శించినట్లు సమాచారం. అదే ఆయన చివరిసారిగా బహిరంగంగా కనిపించిన సందర్భంగా పేర్కొంటున్నారు. ఉత్తర కొరియా వ్యవహారాల విశ్లేషకుడు బెనెడిక్ట్‌రోజర్స్ మాట్లాడుతూ, కిమ్ ఆరోగ్యంపై గతంలోనూ ఇలాంటి వార్తలు ప్రచారంలోకి వచ్చాయని గుర్తుచేశారు. ఆయన మరణించారంటూ గతంలో కూడా ఊహాగానాలు వచ్చాయని పేర్కొన్నారు.



కిమ్‌జాంగ్ ఉన్

ఉత్తర కొరియా నాయకుల మరణాల సందర్భంలో ప్రజలు బహిరంగంగా దుఃఖం వ్యక్తం చేయడం, ప్రభుత్వ మీడియా భావోద్వేగ కథనాలను ప్రసారం చేయడం గతంలో కనిపించిందని విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు. కిమ్ జోంగ్ ఉన్ ఆరోగ్యంపై వస్తున్న వార్తలతో ఆయన సోదరి కిమ్ యో జోంగ్ పేరు మరోసారి తెరపైకి వచ్చింది. ఉత్తర కొరియా నాయకత్వంలో ఆమె కీలకపాత్ర పోషిస్తున్న వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఒకవేళ కిమ్ మరణిస్తే, తాత్కాలికంగా ఆమె దేశబాధ్యతలు చేపట్టే అవకాశంఉందని కొందరి అంచనా. కిమ్‌కుమార్తె కిమ్ జు యే బాధ్యతలు చేపట్టే వయస్సుకు వచ్చేవరకు యోజోంగ్ దేశాన్ని నడిపించవచ్చన వాదనకూడా ఉంది. 13ఏళ్ల కిమ్ జుయే ఇటీవల తన తండ్రితో కలిసి పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. 2022 నవంబర్‌లో క్షిపణి ప్రయోగ కార్యక్రమంలో తండ్రితో కలిసి కనిపించడం ఆమె తొలిబహిరంగ ప్రదర్శనగా భావిస్తున్నారు. ఆ తర్వాత సైనిక, ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు విదేశీ పర్యటనల్లోనూ ఆమె కనిపించారు. దక్షిణ కొరియా నిఘా వర్గాలు కిమ్ జుయేను ఆయన వారసురాలిగా పరిగణిస్తున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. అయినప్పటికీ, ఆమెను అధికారికంగా వారసురాలిగా ప్రకటించలేదు. భవిష్యత్తులో ఆమె దేశాధినేతగా బాధ్యతలు చేపడితే, ఉత్తరకొరియా రాజవంశ చరిత్రలో ఆ పదవిని చేపట్టిన తొలి మహిళగా నిలుస్తారు. ఇదిలా ఉండగా, కిమ్ యో జోంగ్ రాజకీయంగా చురుకుగా కొనసాగుతున్నారు. కిమ్‌ఆరోగ్యంపై ప్రస్తుత ప్రచారం 2020లో వచ్చిన వార్తలను గుర్తు చేస్తోంది. అప్పట్లో ఆయన కొన్ని వారాల పాటు బహిరంగంగా కనిపించకపోవడంతో అనేక ఊహాగానాలు వెలువడ్డాయి. ఆయన కోమాలో ఉన్నారని, అధికారాన్ని సోదరి కిమ్ యో జోంగ్‌కు అప్పగించేందుకు సిద్ధమవుతున్నారని అప్పట్లో ఓ మాజీ దౌత్యవేత్త పేర్కొన్నట్లు వార్తలు వచ్చాయి. కిమ్ బరువు, గుండె సంబంధిత ఆరోగ్య ప్రమాదాలపై గతంలోవచ్చిన నివేదికలు కూడా ఆయన ఆరోగ్యంపై ఆందోళనలకు కారణమయ్యాయి. ఈ నెల ప్రారంభంలో దక్షిణకొరియా జాతీయ నిఘా సేవను ఉటంకిస్తూ వచ్చిన కథనాల ప్రకారం, ఆయన బరువు 140 కిలోగ్రాములకు పైగా ఉండవచ్చని, ఎత్తు సుమారు 170 సెంటీమీటర్లు అని పేర్కొన్నారు. గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం గురించి కూడా ఆ నివేదికల్లో ప్రస్తావించారు. కిమ్ జోంగ్ ఉన్ తన తండ్రి కిమ్ జోంగ్ ఇల్ మరణం తర్వాత 2011లో ఉత్తర కొరియా అధికార పగ్గాలు చేపట్టారు. కిమ్ జోంగ్ ఇల్ 1994నుంచి 2011 వరకు దేశాన్ని పాలించారు. ప్రస్తుతానికి కిమ్‌జోంగ్ ఉన్‌కు మెదడులో రక్తస్రావం జరిగిందని, ఆయన కోమాలో ఉన్నారని లేదా అత్యవసర చికిత్స కోసం చైనాకువెళ్లారని నిర్ధారించే ఆధారాలు లేవు. ఉత్తర కొరియా నుంచి అధికారిక ప్రకటన వెలువడే వరకుఆయన ఆరోగ్య పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. కిమ్‌జాంగ్ ఉన్‌పై ఎలాంటి కథనం వచ్చినా అంతర్జాతీయంగా సంచలనం కలిగించేదే. ఓ పక్క ఖండాంతర క్షిపణుల పరీక్షలతో అటు అమెరికా ఇటు జపాన్, దక్షిణకొరియాలకు కలవరం పుట్టిస్తున్న ఈ ఆధునిక నియంత ప్రజాబాహుళ్యంలోకి వస్తే తప్ప చక్కర్లు కొడుతున్న ఊహాగానాలకు తెరపడదు. ●

# ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అప్రమత్తత అవసరం

**దాడిశెట్టి శ్యామ్ కుమార్**

దేశంలో ఎల్‌నినో ప్రభావంతో ప్రధానంగా వ్యవసాయ రంగం మీద ఎల్‌నినో ప్రభావం అధికంగానే గోచరిస్తుంది. వ్యవసాయ రంగం తీవ్ర ప్రతికూల ప్రభావాలను ఎదుర్కొంటుంది. ఇప్పటికే వర్షాలు లేక చాలా చోట్ల రైతులు పూర్తిస్థాయిలో పంటలు పండించలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రధానంగా ఎల్‌నినో ప్రభావంతో ఋతు పవనాలలో అనేక మార్పులు సంభవించి ఉష్ణోగ్రతవ్యత్యాసాలు అసాధారణ రీతిలో కొనసాగితే సాధారణ వర్షపాతం కన్నా అతి తక్కువ స్థాయిలో వర్షపాతం నమోదు కావడం, తద్వారా వ్యవసాయ అభివృద్ధిలో కావాల్సిన నీరు రైతులకు అందుబాటులో లేక భూగర్భ జలాలు అడుగంటి పోయి లేక పూర్తిగా ఎండిపోవడం ద్వారా సజావుగా సురక్షితంగా పంటలు పండించలేని పరిస్థితి రైతాంగానికి ఏర్పడే అవకాశం లేకపోలేదని చర్చ జరుగుతుంది. ఒకవేళ ఎల్‌నినో ప్రభావం మరింత అధికంగా ప్రభావం చూపిస్తే ఆహార ఉత్పత్తులతో పాటు వ్యాపార వాణిజ్య పంటలు పండించడానికి సాగునీరు కావల్సినంత లేకపోవడం వల్ల ఈసారి పంటల సాగుకు తీవ్రమైన కొరత ఏర్పడే అవకాశం లేకపోలేదని నిపుణుల అంచనా. అయితే వ్యవసాయ రంగంలో రైతాంగం అధికంగా పెట్టుబడులు పెట్టి పంటలు పండించడానికి ప్రయత్నం చేస్తున్నా సాగుబడికి వాతావరణం అనుకూలంగా లేకపోతే పంటల దిగుబడి ఉత్పత్తి అనుకున్న స్థాయిలో తగినంతగా ఉంటుందో లేదో చెప్పలేని పరిస్థితులు చాలా వరకు నెలకొంటున్నాయి. తద్వారా ఆహార ఉత్పత్తులతో పాటు రైతులు ఆర్థికంగా నష్టపోయే అవకాశం లేకపోలేదు. ప్రకృతి వాతావరణంలో వచ్చిన మార్పులతో ఎల్‌నినో ప్రభావం వ్యవసాయ రంగంపై సూటిగా ప్రభావం చూపెడుతుంది. అయితే ఈ క్రమంలో వ్యవసాయ రంగంలో చాలావరకు రైతాంగం గతంతో పోలిస్తే భిన్నమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సిన సందర్భాలు వస్తాయేమో అనే సంశయం రాకమానదు. ఈఅంశమై ఇప్పటికే ప్రభుత్వాలు రైతులకు అవగాహన కల్పించేవిధంగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. కాబట్టి రైతుల అప్రమత్తత చాలా ముఖ్యమైనది. వ్యవసాయ రంగంలో నిర్దిష్టమైన సమయానికి వ్యవసాయం సమృద్ధిగా నీటివనరులతో అనువైనరీతిలో కొనసాగితే కొంతవరకు సమగ్రంగా ఆహార ఉత్పత్తులుఅనుకూలంగా ఉంటాయి. లేకుంటే దైనందిన జీవితంలో రోజురోజుకీ ఆర్థికంగా విపరీతమైన రేట్లు పెరిగే అవకాశం లేకపోలేదు. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో భారీ నీటి ఎత్తిపోతల ప్రాజెక్టులున్నప్పటికీ, ఇలాంటి సందర్భాల్లో ఇవి ఉపయోగపడాల్సింది పోయి ప్రస్తుత పరిస్థితుల్లో నిరుపయోగంగానే ఉంటున్నాయా అనిపిస్తుంది. ఎందుకంటే ఇంతకాలం ఎంతో కొంతైనా ఎత్తిపోతల ప్రాజెక్టులు ద్వారా వ్యవసాయానికి ప్రాధాన్యత ఏర్పడినా కారణాలు ఏవైనా సందిగ్ధంలో ప్రాజెక్టుల పరిస్థితి గోచరిస్తుంది అనే భిన్న అభిప్రాయాలు రైతాంగంలో లేకపోలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రాల్లో రైతులకు కావలసినంత నీరు అందించే విధానాలతో పాటు అవసరమైన ఉపయుక్తంగా ఉండే ప్రాజెక్టులను పునర్వ్యవస్థీకరించేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలు త్వరితగతిన వ్యవసాయ రంగానికి వీలైనంత సాగునీటిని అందించేందుకు ప్రయత్నించడం శుభపరిణామమైనా ఇంకా ఎల్‌నినో తీవ్రరూపంగా రూపాంతరం చెందక ముందే మరింత ఎక్కువగా రైతాంగాన్ని అప్రమత్తత చేయవలసిన అవసరం ఉంది. ఎల్‌నినో ప్రభావంతో చెరువులు కుంటల్లో నీరు కూడా ఆవిరిగా మారే పరిస్థితులు నెలకొంటున్నాయి. కాబట్టి భూగర్భంలో నీటి నిల్వలు తక్కువై బావులతోపాటు, బోర్లలో కూడా నీరు తక్కువైపోతుంది. అలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు ఎల్‌నినో ప్రభావాన్ని వీలైనంత ఎదుర్కోవడానికి ప్రధానంగా రైతులు ప్రత్యామ్నాయంగా పండించే పంటలపై ఎక్కువగా దృష్టి సారించాలి. తక్కువ నీటితో పంటలు పండే అవకాశం ఉన్నటువంటి పంటలను వీలైనంత ఎక్కువ పండించడానికి ప్రయత్నం చేయాలి అనేచర్చ జరుగుతుంది. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగంలో కావాల్సిన సాగుబడి దిగుబడి లేకపోతే ఉత్పత్తి తక్కువై



ఆహార ఉత్పత్తుల అనుకూల స్థాయిలో లేకపోవడం వల్ల మార్కెట్లో ధరలు కూడా పెరిగిపోయే అవకాశం ఉంది. మామూలు జనాలకు కూడా అనేక రూపాలలో ఎల్‌నినో ప్రభావం ప్రత్యక్షంగా పరోక్షంగా చూపుతుంది. ఎల్‌నినో ప్రభావం అధిగమించాలంటే తక్కువ నీటితో ఎక్కువ ఆహార పంటలు పండించడం తోపాటు రైతులు ఆర్థికంగా నష్టపోకుండా పెట్టుబడి తక్కువ ఉండాలి. కరవును అధిగమించే వ్యవసాయం పద్ధతులను పాటించాలి. అలాంటి విషయాలపై మారుమూల ప్రాంతాల్లోని రైతులు సైతం పూర్తి అవగాహన కలిగి ఉండాలి. ఇప్పటికే వర్షాలు సరైన రీతిలో లేకపోవడం వల్ల రైతులు చాలా వరకు నష్టపోయారు. వ్యవసాయంలో నీరు నిల్వల ఆధారంగా పంటల స్వభావానికి అనుగుణంగా నీటి నిలువలు ఉంచితే నిలువ ఉన్న నీటి ద్వారా ఎక్కువ పంటలు పండించడానికి కృషి చేయాలి. తక్కువ నీటితో పండే పంటలు రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు సలహాల మేరకు ప్రభుత్వ సూచించిన విధానాలను అనుగుణంగా రైతులు క్రమమైన పద్ధతిలో వ్యవసాయాన్ని చేసుకునే ప్రయత్నం చేయాల్సి ఉంటుందేమో. వర్షపాతం తక్కువ ఉన్నచోట వరి పంట సాగును కొంత తక్కువ చేసిజొన్న మొక్కజొన్న కంది పెసర లాంటి చిరుధాన్యాలు పంటల అభివృద్ధి సాగు విషయంలో రైతు పూర్తిస్థాయిలో నష్టపోకుండా ఆచితూచి ఆలోచించాలి. వీలైనన్ని ఎక్కువ పంటలు పండించడానికి ప్రయత్నం చేయాల్సి ఉంటుందని అంటున్నారు. ప్రభుత్వాలు కూడా ఎల్‌నినో ప్రభావం వల్ల రైతుల నష్టపోకుండా కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ శాఖ నీటి సంరక్షణ విధానాలు ప్రత్యామ్నాయ సాగు లాంటి కార్యక్రమాలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిరంతరం చేపడుతుంది. రైతులను ఆదుకోవాలనే సదుద్దేశంతో ప్రభుత్వాలుకూడా ప్రధానంగా వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించి రైతులకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చ వేదికలు ప్రసార మాధ్యమాలలో ఎక్కువగా ప్రచారం చేస్తుండడం గమనార్హం. తక్కువ నీటి నిల్వలు ఉండేటటువంటి ప్రాంతాల్లో రైతులకు పెట్టుబడి తగ్గించే విధంగా బిందు సేద్యం ఆరుతడి పంటలు కూరగాయలు తదితర వాతావరణానికి అనుకూలమైన పంటలను వేయడం వల్ల రైతులు నష్టపోకుండా ఆర్థికంగా ఉంటారు. ఎంతో కొంతైనా నీటినిమాత్రం పొదుపుగా వాడుకోవాలి. సాగు నీటితో పాటు త్రాగు నీరు కూడా చాలా ముఖ్యమైనది కాబట్టి త్రాగునీటి నిలువలను కూడా ఒడిసి పట్టుకోవాలి. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో మంచినీటి వనరుల దగ్గర ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసుకొని ఏర్పాట్లు తాగునీరు అందరికి అందే విధంగా పొదుపుగా వాడుకోవాలి. ఎల్‌నినో ప్రభావం తగ్గే వరకు కూడా అన్ని రంగాల్లో అప్రమత్తం అవసరం కావచ్చు. రైతులు నష్టపోకుండా తరచూ మార్కెట్ ధరలను గమనిస్తూ ఉండాలి. భూసారంలో తేమను పోనీయకుండా పొలంలో నీటినివృధా చేయకుండా దృష్టి పెట్టాలి. పంటకు అవసరమైన చోటనే నీరు ఉండేటట్టు చూసుకోవాలి. వీలైనంత గుంతలు ఏర్పాటు చేసుకొని నీటి నిల్వలకు ఆస్కారం ఉండేవిధంగా ప్రయత్నం చేయాలి. ఎప్పటికప్పుడు ప్రభుత్వం చేసే సూచనలను గమనిస్తూ, ఎల్‌నినో ప్రభావం విషయాలపై పూర్తి అవగాహన కలిగి ఉంటే మంచిదే. భూమిలో తేమను కాపాడడానికి గడ్డితో స్వభావానికి అనుగుణంగా కప్పి అంతరకృషి చేయవలసి ఉంటుంది. వీలైతే పొలంలో నీటి పారుదల విషయంలో ఎక్కువ శ్రద్ధ వహించాలి. నీటిపారుదల విషయంలో వాతావరణ శాఖ సూచనలు నిరంతరం గమనిస్తూ ఒకవేళ వర్షాలు పడితే సరేసరి. లేకపోతే మధ్యలో ఆగిపోతే ప్రత్యామ్నాయ పంటలను వేసుకునే విధానాన్ని వ్యవసాయ అధికారులను కలిసి వాటికి సంబంధించిన విత్తనాలను, ఎరువులను సిద్ధం చేసుకోవాలి. నేల పరీక్ష ఆధారంగాఎరువులు వాడాలి. అవసరం లేని పురుగుమందుల పిచికారీ నివారించాలి. విత్తనాలు, యంత్రాలు ఇతర రైతులతో కలిసి కొనుగోలు చేయడం లేదా కిరాయి తీసుకోవడం ద్వారా ఖర్చు తగ్గించవచ్చు. అంతేకాకుండా పంట ఎదుగుదల విధానాన్ని క్రమం తప్పకుండా పరిశీలిస్తూ అధిక ఉష్ణోగ్రతలు తేమ లేకుండా ఉన్నప్పుడు ఎప్పటికప్పుడు తెగుళ్ల పురుగులు కనిపిస్తే వ్యవసాయ అధికారి నుంచి సూచన సేకరించి నివారణ చర్యలు నిరంతరం క్రమమైన పద్ధతిలో చేపట్టాలి. వ్యవసాయ రంగంలో పశువులకు కూడా చాలా ప్రాధాన్యత ఉంటుంది కాబట్టి పశువులను కూడా కాపాడుకోవాలి. ●

# సమస్యాత్మకమే అయినా ఘర్షణల్లేవు!

## భారత్, చైనా సరిహద్దు ప్రాంతంపై కేంద్ర రక్షణశాఖ వెల్లడి




**ఇటానగర్,అక్టోబరు 24:** భారత్‌చైనా సరిహద్దులో అరుణాచల్‌ప్రదేశ్‌లోని రెండు ప్రాంతాలు ఇప్పటికీ సున్నితంగా ఉన్నాయని రక్షణ వర్గాలు వెల్లడించాయి. ఇరు దేశాల సైనికుల మధ్య హింసాత్మక ఘర్షణలు జరిగినట్లు ఎలాంటి సమాచారం లేదని స్పష్టం చేశాయి. వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) విషయంలో భారత్, చైనాకు భిన్నమైన అవగాహనలు ఉండటంతో అసాఫిలా, లాంగ్జు ప్రాంతాల్లో అప్పుడప్పుడు ఉద్రిక్తతలు తలెత్తుతున్నాయని తెలిపాయి. ఈ రెండు ప్రాంతాలు అరుణాచల్‌ప్రదేశ్‌లోని తక్సింగ్ సర్కిల్ పరిధిలో ఉన్నాయి. ప్రస్తుతం అక్కడ పరిస్థితి అదుపులోనే ఉందని పేర్కొన్నాయి. ఇటీవల అరుణాచల్‌ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో చైనా సైన్యంతో ముఖాముఖి పరిస్థితులు కొనసాగుతున్నాయని ఇండోటిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ కపూర్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో సరిహద్దు పరిస్థితిపై చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో అసాఫిలా, లాంగ్జు ప్రాంతాల్లో భారత, చైనా సైనికుల గస్తీ బృందాలు సాధారణ విధుల్లో భాగంగా ఎదురుపడుతున్నాయని రక్షణ వర్గాలు వివరించాయి. క్షేత్ర స్థాయిలోని కమాండర్లు సంయమనం పాటిస్తూ పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకుండా చూస్తున్నారని తెలిపాయి. స్థానికంగా తలెత్తే ఈ ముఖాముఖి పరిస్థితులను పరిష్కరించేందుకు ఇరు దేశాల సైన్యాలు ఇప్పటికే అమల్లో ఉన్న సంప్రదింపుల వ్యవస్థలను ఉపయోగిస్తున్నాయని అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా ఫ్లాగ్ మీటింగ్‌లు, హాట్‌లైన్ ద్వారా సమాచార మార్పిడి జరుగుతోందని చెప్పారు. ఈశాన్య ప్రాంతంలో ఇటీవల జరిగిన కోర్ కమాండర్ స్థాయి చర్చలు కూడా కీలకమైనవిగా పేర్కొన్నారు. సరిహద్దు వివాదాల పరిష్కారానికి సైనిక, దౌత్య మార్గాల్లో చర్చలు కొనసాగడం ముఖ్యమని అభిప్రాయపడ్డారు. సరిహద్దు ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు, టెలికమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, ఇతర పౌర సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నట్లు రక్షణ వర్గాలు తెలిపాయి. వీటివల్ల సైనికుల కార్యకలాపాలకు తోడ్పాటు లభించడంతో పాటు మారుమూల గ్రామాల ప్రజలకు రవాణా, వైద్యం వంటి సేవలు మెరుగుపడతా యని పేర్కొన్నాయి. భవిష్యత్తులో భద్రతా పరమైన పరిస్థితులు అనుకూలిస్తే నియంత్రిత సరిహద్దు వాణిజ్యం, ప్రజల మధ్య సంబంధాలను పెంచే అవకాశాలూ ఉన్నాయని వివరించాయి. ఈ ప్రాంతానికి మతపరమైన, సాంస్కృతిక ప్రాధాన్యం కూడా ఉంది. ఇరు దేశాల బౌద్ధ సమాజాలకు పవిత్రమైన చారిత్రక త్సారి తీర్థయాత్ర మార్గం ఇక్కడి ప్రత్యేకతల్లో ఒకటి. సరిహద్దులో శాంతి నెలకొంటే భవిష్యత్తులో ఈ యాత్రకు సంబంధించి సరిహద్దు దాటే అవకాశాలను పరిశీలించవచ్చని అధికారులు తెలిపారు. అయితే, ఇందుకు ఇరు దేశాల అంగీకారంతోపాటు భద్రతాపరమైన పరిస్థితులు అనుకూలంగా ఉండాలి. మారుమూల ప్రాంతాల్లో సైన్యం వైద్య శిబిరాలు, అత్యవసర తరలింపులు, పాఠశాలల నిర్మాణం, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి కార్యక్రమాల్లోనూ పాలుపంచుకుంటోందని రక్షణ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు, చైనా సైనికులు నిర్దేశిత గస్తీ విధానాలకు భిన్నంగా వ్యవహరించినప్పుడు సరిహద్దులో పరిస్థితులు అప్పుడప్పుడు దెబ్బతింటున్నాయని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.

నిర్దిష్ట ప్రాంతాల్లో జరుగుతున్న పరిణామాలపై ప్రశ్నలను రక్షణ శాఖకు నివేదించాలని సూచించారు. సరిహద్దులో శాంతి,

ప్రశాంతత కొనసాగడం ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధికి అవసరమని స్పష్టం చేశారు.

# రష్యా, ఉక్రెయిన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం

## మెలానియా ట్రంప్ జోక్యం..



**వాషింగ్టన్, అక్టోబరు 24:** నాలుగున్నరేళ్లకుపైగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. యుద్ధంలో తీవ్రంగా దెబ్బతిని, ఆహార కొరతతో ప్రజలు అల్లాడుతున్న ఒలేష్కి నగరంలో స్థానిక కాల్పుల విరమణ ఒప్పందాన్ని సాధించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సతీమణి, ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. రష్యా ఆక్రమణలో ఉన్న ఒలేష్కి నగరంలో ఈ స్థానిక కాల్పుల విరమణ ఒప్పందం ఈ నెల 29 నుంచి ప్రారంభమవుతుందని మెలానియా కార్యాలయం విడుదల చేసిన ప్రకటన తెలిపింది. అయితే దీనిపై అటు రష్యా, ఇటు ఉక్రెయిన్ తక్షణమే అధికారికంగా ధ్రువీకరించలేదు. ఒలేష్కిలో కాల్పుల విరమణ 'ఒలేష్కిలో పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. అది విపత్తు అంచున ఉన్న ఒక పోరాట నగరం' అని డొనాల్డ్‌ట్రంప్ సతీమణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు. 'నేను స్వయంగా జోక్యం చేసుకోకపోతే.. ఆ నగరంలోకి మానవతా సహాయాన్ని అందించడం, వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం సాధ్యమయ్యేది కాదు' అని ఆమె పేర్కొన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో రహస్య సంప్రదింపుల మార్గాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు యేడాది క్రితం వెల్లడించి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిన సంగతి తెలిసిందే. యుద్ధం కారణంగా తమ తల్లిదండ్రులతో వేరుపడిన 34 మంది పిల్లలను తిరిగి వారి కుటుంబాలతో కలిపేలా మెలానియా చర్యలు తీసుకున్నారని ఆమె కార్యాలయం తెలిపింది. ఒలేష్కి సీజ్‌ఫైర్ ప్రణాళిక కోసం తాను రష్యా, ఉక్రెయిన్ అగ్రనాయకత్వంతో సంప్రదింపులు జరిపానని మెలానియా పేర్కొన్నారు. ఇరువైపులా కాల్పులతో ప్రజలు భయాందోళనలు 'అక్కడి నుంచి బయటపడాలని కోరుకునే నివాసితులకు సాయం.. వారు కోరుకున్న ప్రాంతానికి వెళ్లేందుకు రవాణా సౌకర్యం లభిస్తుంది. కొందరు రష్యాకు, మరికొందరు ఉక్రెయిన్‌కు వెళ్లాలని భావిస్తారని నేను ఊహిస్తున్నాను' అని మెలానియా ట్రంప్ అన్నారు.

# వివాహేతర సంబంధం ఉందని క్రూరత్వంగా భావించలేం!

## మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు

**చెన్నై, అక్టోబరు 24:** భర్తకు మరో మహిళతో వివాహేతర సంబంధం ఉన్నంత మాత్రాన, దాన్ని భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ) సెక్షన్ 498ఏ కింద భార్య పట్ల క్రూరత్వంగా పరిగణించలేమని మద్రాస్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ సెక్షన్ కింద నేరం రుజువు కావాలంటే, కేవలం వివాహేతర సంబంధం మాత్రమే కాకుండా అంతకు మించిన క్రూరమైన చర్యలు నిరూపితం కావాలని స్పష్టం చేసింది. భార్య, బిడ్డ ఆత్మహత్యకు సంబంధించిన కేసులో భర్తను నిర్దోషిగా ప్రకటిస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు సమర్థించింది. 2008లో వివాహం చేసుకున్న దంపతులకు ఒక బిడ్డ ఉన్నాడు. అయితే 2010లో భార్య తన ఏడాదిన్నర వయసున్న బిడ్డతో కలిసి నీటిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. తన భర్త వరకట్నం కోసం వేధించాడని, మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను, బిడ్డను నిర్లక్ష్యం చేశాడని గతంలో ఆమె ఆరోపించింది. దీంతో పోలీసులు భర్తపై ఐపీసీ సెక్షన్ 498ఏ (క్రూరత్వం), 306 (ఆత్మహత్యకు ప్రేరేపణ) కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును విచారించిన తిరుప్పూర్ ఫాస్ట్ ట్రాక్ మహిళా కోర్టు, వరకట్న వేధింపుల ఆరోపణలు నిరూపితం కాలేదని పేర్కొంటూ 2018లో భర్తను నిర్దోషిగా ప్రకటించింది. ప్రభుత్వం ఈ తీర్పుపై అప్పీల్‌కు వెళ్లకపోవడంతో, మరణించిన మహిళ సోదరుడు టి.దైవకుమార్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై జస్టిస్ సుందర్ మోహన్ విచారణ జరిపారు. విచారణలో భర్తకు వివాహేతర సంబంధం ఉందని రుజువైన విషయాన్ని హైకోర్టు అంగీకరించింది. ఆ సంబంధం భార్యను ఆత్మహత్యకు పురిగొల్పేంత తీవ్రమైన స్వభావం కలది కాదని అభిప్రాయపడింది. "కేవలం వివాహేతర సంబంధం మాత్రమే సెక్షన్ 498ఎ కింద నేరం కాదు. అంతకు మించిన క్రూరత్వం జరిగిందని నిరూపించాలి. ఈ కేసులో ఆ తరహా ఆధారాలు లేవని న్యాయమూర్తి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గతంలో సుప్రీంకోర్టు పినాకిన్ మహిపత్రాయ్ రావల్ వర్సెస్ గుజరాత్ రాష్ట్రం కేసులో ఇచ్చిన తీర్పును ఉదహరించారు. వరకట్న వేధింపుల ఆరోపణలు కూడా అస్పష్టంగా ఉన్నాయని, ప్రాథమిక ఫిర్యాదులో వాటి ప్రస్తావన లేదని పేర్కొంటూ అప్పీల్‌ను కొట్టివేశారు.

# చిన్మయానంద 3డి హోలోగ్రాఫిక్ అవతార్‌తో ప్రధాని మోడీ ముచ్చట్లు!



**న్యూఢిల్లీ, అక్టోబరు 24:** ఆధ్యాత్మికత, ఆధునిక సాంకేతికత కలిసిన ఓ అరుదైన ఘట్టం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఆవిష్కృతమైంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో రూపొందించిన దివంగత ఆధ్యాత్మిక గురువు స్వామి చిన్మయానంద 3డి హోలోగ్రాఫిక్ అవతార్‌తో ప్రధాని నరేంద్ర మోడీసంభాషించారు. ఈ ఊహించని పరిణామం అక్కడున్న వారిని ఆశ్చర్యానికి గురిచేసింది. స్వామి చిన్మయానంద 1951లో స్థాపించిన చిన్మయ మిషన్ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చిన్మయ అమృత్ మహోత్సవ్ గ్లోబల్ సమ్మేళన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు హాజరైన ప్రధాని మోడీ ప్రసంగిస్తుండగా, వేదికపై అకస్మాత్తుగా స్వామి చిన్మయానంద హోలోగ్రామ్ ప్రత్యక్షమైంది. నరేంద్ర మోడీ మిమ్మల్ని ప్రధానమంత్రిగా చూస్తుంటే చాలా సంతోషంగా ఉందంటూ ఆ హోలోగ్రామ్ పలకరించింది. 1993లో మోడీతో జరిగిన సమావేశాన్ని గుర్తుచేసుకుంది. మీకు శ్రీఖండ్ ప్రసాదంగా ఇస్తాను స్వీకరించండి ఉపవాసం ఉన్నానని మాత్రం చెప్పకండి అని స్వామీజీ హోలోగ్రామ్ ఆశీస్సులు అందించింది. దీనికి మోడీ బదులిస్తూ తన నవరాత్రి ఉపవాసం ముగిసిందని, ప్రసాదాన్ని తప్పకుండా స్వీకరిస్తానని వినమ్రంగా తెలిపారు. స్వామీజీ చూపిన మార్గంలోనే నడవడానికి ప్రయత్నిస్తున్నానని అన్నారు. ఈ సంభాషణ అనంతరం ప్రధాని మోడీభావోద్వేగానికి గురయ్యారు. ఈ క్షణం తనను 33 ఏళ్ల వెనక్కి తీసుకెళ్లినట్లు అనిపించిందని వ్యాఖ్యానించారు. 1993 ఆగస్టులో స్వామి చిన్మయానంద పరమపదించిన విషయం తెలిసిందే. ఆయన భౌతికంగా లేనప్పటికీ ఏఐ, హోలోగ్రాఫిక్ టెక్నాలజీ ద్వారా ఆయన రూపంతో మాట్లాడటం ఒక ప్రత్యేకమైన అనుభూతినిచ్చిందని మోడీ పేర్కొన్నారు. ఈ సంఘటన ఆధ్యాత్మిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించడంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా ఉపయోగించుకోవచ్చో నిరూపించింది. సాంకేతికత సాయంతో గతాన్ని, వర్తమానాన్ని అనుసంధానించిన ఈ అపురూప ఘట్టం సదస్సుకే ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

# ఈ వారాంతంలో ఇరాన్‌పై మళ్లీ అమెరికా దాడులు

## మరో 'ఎపిక్ ఫ్యూరీ' జరగొచ్చునంటూ ట్రంప్ సంకేతం



**వాషింగ్టన్, అక్టోబరు 24:** ఈ వారాంతంలో ఇరాన్‌పై అమెరికా భీకర దాడులు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. టెహ్రాన్‌తో ఎలాంటి ఒప్పందం కుదరకపోతే తాము మరోసారి సైనిక చర్యకు దిగే అవకాశం ఉందని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలు ఇచ్చారు.

మధ్యంతర ఎన్నికల ప్రచారంలో భాగంగా ఫ్లోరిడా ర్యాలీలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'పశ్చిమాసియాలో మరో చిన్నస్థాయి ఎపిక్ ఫ్యూరీ జరగొచ్చు' అని ట్రంప్ హెచ్చరించారు. ఈ వారాంతంలో ఇరాన్‌పై దాడులు జరిగే అవకాశం ఉందని తుర్కియేలోని అమెరికా రాయబారి టామ్ బారక్ ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో వ్యాఖ్యలు చేశారు. తొలుత వాటిని ట్రంప్ తోసిపుచ్చారు. 'ఓ ఆయన (బారక్) మా రాయబారా? ఆయన బాగా పలుకుబడి ఉన్న వ్యక్తి అనుకుంటా? కానీ, ఆ దాడుల వ్యాఖ్యల గురించి నాకు ఏమీ తెలియదు' అని అధ్యక్షుడు వ్యాఖ్యానించారు. అయితే, ఇప్పుడు స్వయంగా ట్రంప్ దాడుల గురించి హింట్ ఇవ్వడం గమనార్హం. దీంతో పశ్చిమాసియాలో మళ్లీ పరిస్థితులు ఉత్కంఠగా మారాయి.

ఇదిలా ఉండగా అమెరికా హెచ్చరికల వార్తలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. నిప్పుతో చెలగాటమాడొద్దంటూ వార్నింగ్ ఇచ్చింది. తమపై మరోసారి దాడులు జరిగితే గల్ఫ్ దేశాల్లోని సముద్ర గర్భంలో ఉన్న కమ్యూనికేషన్ కేబుళ్లను ధ్వంసం చేస్తామని ఇప్పటికే హెచ్చరించింది. 'ఇరాన్‌పై దాడి జరిగితే.. ఇక ఎలాంటి హద్దులు ఉండవు. కేబుళ్లు, మిలిటరీ స్థావరాలు.. వేటిని వదలబోం' అని పేర్కొంది. ఈ యేడాది ఫిబ్రవరి 28న ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ పేరిట అమెరికా దాడులు చేసిన సంగతి విదితమే. అప్పటి నుంచి పశ్చిమాసియాలో ఏదో ఒక రూపంలో ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయి. చమురు సరఫరాకు అంతరాయాలు ఏర్పడటంతో ప్రపంచాన్ని ఇంధన వ్యయాల భయాలు వెంటాడుతున్నాయి.

# మా ఇద్దరి పరిచయం ఓ రెస్టారెంట్‌లో..

### రాజీవ్‌గాంధీతో తొలి జ్ఞాపకాలను ఇన్‌స్టాలో పంచుకున్న సోనియాగాంధీ

### ఆమె ఆత్మకథలో ఇటువంటి విషయాలు ఎన్నెన్నో!



**న్యూఢిల్లీ,అక్టోబరు 24:** కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ తన రాబోయే ఆత్మకథ బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్ వేదికగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీతో తన తొలి పరిచయం, ప్రేమకథ , తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ పుస్తకం వచ్చేనెల నవంబర్ 10న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సోనియా గాంధీ సోషల్ మీడియాలో విడుదల చేసిన ఒక వీడియో గ్లింప్స్‌లో 1960ల నాటి తమ ప్రేమ ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. 1960ల మధ్యకాలంలో ఇంగ్లాండ్‌లోని కేంబ్రిడ్జ్‌లో ఉన్న వర్సిటీ రెస్టారెంట్ అనే ఒక గ్రీక్ రెస్టారెంట్‌లో వీరిద్దరి తొలి పరిచయం జరిగింది. అప్పట్లో ఇంగ్లాండ్‌లో ఆహారం అంతగా నచ్చకపోవడంతో, తన సొంత దేశం ఇటలీ వంటకాలకు దగ్గరగా ఉండే రుచుల కోసం వెతుకుతుండగా ఒక మ్యూచువల్ ఫ్రెండ్ ద్వారా రాజీవ్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. రాజీవ్‌ను మొదటిసారి చూసిన వెంటనే ఆయనతో జీవితాన్ని పంచుకోవాలని తనకు అనిపించిందని, రాజీవ్ మనసులో కూడా అదే భావన కలిగిందని సోనియా తెలిపారు. రాజీవ్ గాంధీ అందగాడు మాత్రమే కాకుండా, ఆయనలోని నెమ్మదితనం, సౌమ్యత తనను ఎంతో ఆకట్టుకున్నాయని సోనియా గుర్తుచేసుకున్నారు. ప్రారంభంలో వీరి పరిచయం స్నేహంగా మారి, ఆ తర్వాత ప్రేమగా రూపాంతరం చెందింది. విద్యార్థి రోజుల్లో పార్టీలకు వెళ్లడం, విహారయాత్రలు చేయడం వంటి సాధారణ జ్ఞాపకాలతో వారి అనుబంధం బలపడింది. అనంతరం 1968లో వీరిద్దరూ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. రాజీవ్ గాంధీ 1984 నుంచి 1989 వరకు భారతదేశ ప్రధానిగా సేవలందించారు. ఆ తర్వాత 1991లో తమిళనాడులో ఎన్నికల ప్రచారంలో ఉన్నప్పుడు ఆయన దారుణంగా హత్యకు గురయ్యారు. రాజీవ్‌తో గడిపిన ఆనందకర క్షణాలు, వారి ప్రేమ ప్రపంచాన్ని ఈ పుస్తకంలో ఆవిష్కరించినట్లు సోనియా పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా, వారిద్దరి వ్యక్తిగత జీవితం, అనుబంధాన్ని ఈ ఆత్మకథ ద్వారా పాఠకులకు అందించనున్నారు.

# టైగర్‌ష్రాఫ్ కాల్పుల కేసులో కొత్తకోణం



**ముంబయి, అక్టోబరు 24:** బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ కారుపై జరిగిన కాల్పుల కేసు దర్యాప్తులో ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు కీలక విషయాలను గుర్తించారు. ఈనెల 18న జరిగిన ఈ దాడి తర్వాత, షూటర్ల ముఖాలు టీవీ వార్తల్లో ప్రసారం కావడంతో వారి హ్యాండ్లర్లు వెంటనే అప్రమత్తం చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. షూటర్లను తప్పించుకోవాల్సిందిగా వారు హెచ్చరించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకు 10 మందిని అరెస్ట్ చేశారు. దాడికి ముందు, దాడి సమయంలో, ఆ తర్వాత కూడా షూటర్లు తమ హ్యాండ్లర్లతో నిరంతరం ఫోన్ కాల్స్, మెసేజ్‌ల ద్వారా టచ్‌లో ఉన్నారని పోలీసుల విచారణలో వెల్లడైంది. హ్యాండ్లర్ల నుంచి ఎప్పటికప్పుడు సూచనలు, అప్‌డేట్స్ అందుకుంటూ వారు ఈ దాడికి పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసులో వాంటెడ్ నిందితుడిగా ఉన్న అనిల్ పండిత్ పాత్రపై పోలీసులు ప్రధానంగా దృష్టి సారించారు. ప్రస్తుతం అతను అమెరికాలో ఉన్నట్లు అనుమానిస్తున్నారు. అతనితో పాటు ఇటీవల అరెస్ట్ అయిన అంకిత్ ఖటక్, సమీర్ ఖత్రీల పాత్రలపై కూడా లోతుగా విచారణ జరుపుతున్నారు. దాడికి ఉపయోగించిన ఆయుధాలు, మందుగుండు సామగ్రిని సమకూర్చడంలో ఇతరుల ప్రమేయంపై కూడా ఆరా తీస్తున్నారు. ఈనెల 18న ముంబైలోని జుహూ ప్రాంతంలో టైగర్ ష్రాఫ్ ప్రయాణిస్తున్న కారు లక్ష్యంగా దుండగులు కాల్పులు జరిపి మోటార్‌సైకిల్‌పై పరారయ్యారు. ఈ ఘటనలో టైగర్ ష్రాఫ్‌కు స్వల్ప గాయాలవగా, అతని డ్రైవర్, అక్కడే ఉన్న మరో వ్యక్తి గాయపడ్డారు. దాడి తర్వాత నిందితులు ఉపయోగించిన మోటార్‌సైకిల్‌ను పోలీసులు అంధేరిలో వదిలివెళ్లినట్లు కనుగొన్నారు. ఈ కేసుకు సంబంధించి ముగ్గురు ప్రధాన నిందితులను రాజస్థాన్‌లోని కోటాలో అరెస్ట్ చేయడంతో దర్యాప్తు వేగవంతమైంది. కేసు వెనుక ఉన్న పూర్తి నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు ముంబై పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

# దీప్కేపై బెర్లిన్‌లో కేంద్ర మంత్రి పీయూష్ సెటైర్లు




**బెర్లిన్, అక్టోబరు 24:** కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తన జర్మనీ పర్యటనలో కీలక వ్యాఖ్యలు చేశారు. బెర్లిన్‌లో భారతీయ విద్యార్థులతో ముచ్చటించిన ఆయన, కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేను ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. అదే సమయంలో, వాతావరణ మార్పుల అంశంలో యూరప్ దేశాల వైఖరిని ఆయన గట్టిగా నిలదీశారు. విదేశాల్లో ఉన్న భారతీయ ప్రతిభావంతులను తిరిగి స్వదేశానికి ఆకర్షించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై బెర్లిన్‌లో సైన్స్ అండ్ టెక్నాలజీ విద్యార్థులతో గోయల్ చర్చించారు. ఈ సందర్భంగా చైనా అనుసరిస్తున్న విధానాలను ప్రస్తావిస్తూ, ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ చూసినా భారతీయ ప్రతిభ కనిపిస్తుంది. వారిని తిరిగి ఎలా ఆకర్షించాలనే దానిపై దృష్టి సారించాలి. అయితే, ఈ ప్రక్రియలో నిధుల దుర్వినియోగం జరగకుండా జాగ్రత్త వహించాలి. చైనాలో అక్రమాలు జరిగితే మనుషులు మాయమవుతారు, అదే మన దేశంలో జరిగితే మంత్రిగా నేనే మాయమైపోతానంటూ చమత్కరించారు. భారత్‌లోనూ చైనా తరహా కార్యక్రమాలను అమలు చేస్తారా? అని ఒక విద్యార్థి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ అది మంచి ఆలోచనే, కానీ అక్కడే నియంతృత్వానికి, ప్రజాస్వామ్యానికి మధ్య వ్యత్యాసం కనిపిస్తుంది. మనం అటువంటి పథకాలను ప్రవేశపెడితే, విద్యార్థులకు నిధులు, స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనంటూ అభిజిత్ దీప్కే వంటి వారు విమర్శలు చేస్తూ మెదళ్లను పాడుచేస్తారు. అందుకే మన ప్రజాస్వామ్య వ్యవస్థకు అనుగుణంగా విధానాలను రూపొందించుకోవాలని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీక్, ఓటర్ల జాబితా తారుమారు ఆరోపణలపై అభిజిత్ దీప్కే నేతృత్వంలోని సీజేపీ ఇటీవల నిరసనలు చేపట్టిన విషయం తెలిసిందే. భారతీయ విద్యార్థులు తమ మాతృభూమికి తిరిగి వచ్చి దేశ సేవలో భాగస్వాములు కావాలని గోయల్ పిలుపునిచ్చారు. మిమ్మల్ని తిరిగి దేశానికి రప్పించాలని మేము ఆకాంక్షిస్తున్నాం. ఇది కేవలం ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన విషయం మాత్రమే కాదు, ఇది మీ మాతృభూమి. మీ జీవితంలో కొంత సమయాన్ని దేశం కోసం కేటాయించండని ఆయన కోరారు.

# సంక్షిప్త వార్తలు

## సైనిక శిక్షణ విమానాలు గాల్లోనే ఢీ!

**మనీలా, అక్టోబరు 24:** ఫిలిప్పీన్స్‌లో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. శిక్షణలో ఉన్న రెండు సైనిక విమానాలు గాల్లోనే ఢీకొని కూలిపోవడంతో నలుగురు పైలట్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన మనీలాకు దక్షిణంగా ఉన్న ఫెర్నాండో వైమానిక స్థావరం వద్ద చోటు చేసుకుంది. ఫిలిప్పీన్స్ వైమానిక దళం శనివారం ఈ విషయాన్ని ధ్రువీకరించింది. ప్రమాదానికి గురైనవి ఎస్‌ఎఫ్260 రకానికి చెందిన సింగిల్ ప్రొపెల్లర్ శిక్షణ విమానాలు. శిక్షణ విన్యాసాల్లో పాల్గొంటున్న సమయంలో రెండు విమానాలు గాల్లో ఢీకొన్నట్లు వీడియో దృశ్యాల్లో కనిపిస్తోంది. ఢీకొన్న తర్వాత అవి అదుపు తప్పి కిందకు దూసుకెళ్లి కూలిపోయాయి.

## సింగపూర్‌కు భారత్ అస్త్ర ఎంకె1 ఎగుమతులు!



**న్యూఢిల్లీ, అక్టోబరు 24:** భారత్ స్వదేశీ రక్షణ ఉత్పత్తులపై విదేశాలు ఆసక్తి చూపిస్తున్నాయి. ఇప్పటికే బ్రహ్మోస్ మిస్సైల్ కొనుగోలుకు ఇండోనేషియా సిద్ధమైంది, ఇప్పుడు భారత్ అభివృద్ధి చేసిన అస్త్ర ఎంకె-1 గగనతల క్షిపణులను తన సు30 ఎంకె2 యుద్ధవిమానాలకు అనుసంధానించే అవకాశాలను కూడా ఇండోనేషియా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. 2026 జూన్‌లో ప్రధాని నరేంద్ర మోడీ ఇండోనేషియా పర్యటనకు వెళ్లారు. ఆ సమయంలో అస్త్ర ఎంకె1 కొనుగోలుపై సూత్రప్రాయంగా అంగీకారం కుదిరినట్లు తెలుస్తోంది.

## భారతీయ శాస్త్రవేత్త అశోక్‌సేన్‌కు అరుదైన పురస్కారం

**న్యూఢిల్లీ, అక్టోబరు 24:** భారతీయ శాస్త్రవేత్త అశోక్ సేన్ అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. భౌతిక శాస్త్ర రంగంలో విశేష కృషికి ఇచ్చే ప్రతిష్ఠాత్మక ఆస్కార్ క్లైన్ పతకం2026 ఆయనను వరించింది. ఈ పురస్కారాన్ని అందుకున్న తొలి భారతీయ భౌతిక శాస్త్రవేత్తగా ఆయన చరిత్ర సృష్టించారు. స్ట్రింగ్ థియరీ, కృష్ణబిలాల ఎంట్రోపీ, స్ట్రింగ్ ఫీల్డ్ థియరీపై ఆయన చేసిన పరిశోధనలకు ఈ గుర్తింపు లభించింది.

## అందాలపోటీలపై బుర్కినాఫాసో నిషేధం!



**ఔగాడౌంగౌ, బుర్కినాఫాసో, అక్టోబరు 24:** పశ్చిమాఫ్రికా దేశమైన బుర్కినా ఫాసో సైనిక ప్రభుత్వం సంచలన నిర్ణయాలతో వార్తల్లో నిలిచింది. దేశంలో జరిగే అన్ని రకాల అందాల పోటీలను తక్షణమే నిలిపివేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. దేశ సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక విలువలకు ఈ పోటీలు విఘాతం కలిగిస్తున్నాయని, వాటికి అనుగుణంగా కొత్త నిబంధనలు రూపొందించే వరకు ఈ నిషేధం కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇకపై ఇలాంటి కార్యక్రమాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వబోమని కూడా తేల్చి చెప్పింది.

## జైషే మిలిటెంట్ సానుభూతిపరుడు ముంబయిలో అరెస్టు

**ముంబయి, అక్టోబరు 24:** మహానగరంలో ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే నిషేధిత ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ తో సంబంధాలున్నాయనే ఆరోపణలపై మహారాష్ట్ర ఉగ్రవాద నిరోధక దళం ఒక వ్యక్తిని అరెస్ట్ చేసింది. రాపిడో బైక్ రైడర్‌గా పనిచేస్తున్న 33 ఏళ్ల వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం కలకలం రేపింది. నిందితుడిని మహ్మద్ హసన్ అబు సర్మాద్ అక్తర్‌గా గుర్తించారు. ఇతడు బీహార్‌కు చెందినవాడయినప్పటికీ,

గత పదేళ్లుగా ముంబైలోనే నివసిస్తున్నాడు. నగరంలో రాపిడో రైడర్‌గా పనిచేస్తూ, అదనంగా పెర్ఫ్యూమ్‌లు కూడా అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు.

# తమిళనాడు సిఎం విజయ్‌కి కేంద్రం ప్రశంసలు

## ఎటిఎఫ్‌పై వాట్ 26 నుంచి 16శాతానికి తగ్గింపు



**చెన్నై, అక్టోబరు 24:** తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్ ప్రభుత్వానికి కేంద్రం నుంచి ప్రశంసలు లభించాయి. రాష్ట్రంలోని విమానాశ్రయాల్లో విమాన ఇంధనంపై విలువ ఆధారిత పన్ను (వ్యాట్) తగ్గిస్తూ తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్వాగతించారు. విమాన ప్రయాణాన్ని మరింత అందుబాటులోకి తీసుకురావాలంటే కేంద్రం, రాష్ట్రాలు కలిసి పనిచేయాలని పేర్కొన్నారు. పెరుగుతున్న ముడి చమురు ధరల నేపథ్యంలో విమానయాన సంస్థలకు ఈ నిర్ణయం కొంత ఊరటనివ్వనుంది. తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం చెన్నై విమానాశ్రయంలో విమాన ఇంధనం (ఏటీఎఫ్)పై వ్యాట్‌ను ప్రస్తుతం ఉన్న 29 శాతం నుంచి 16 శాతానికి తగ్గించారు. రాష్ట్రంలోని ఇతర విమానాశ్రయాల్లో ఈ పన్నును 29 శాతం నుంచి కేవలం ఒక శాతానికి తగ్గించారు. ఈ నిర్ణయం నవంబర్ 1 నుంచి అమల్లోకి రానుంది. 2027 అక్టోబర్ 31 వరకు ఈ పన్ను రాయితీ కొనసాగుతుంది. రాష్ట్రంలోని నగరాల మధ్య విమాన సర్వీసులను పెంచడం, విమానయాన సంస్థల నిర్వహణ ఖర్చులను తగ్గించడం ఈ నిర్ణయం వెనుక ప్రధాన లక్ష్యాలు. ఈ నిర్ణయంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించారు. విమాన ఇంధనంపై వ్యాట్ తగ్గింపు విమానయాన రంగానికి స్వాగతించదగిన చర్య అని పేర్కొన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి విజయ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

# సీజెపి సౌరవ్‌దాస్‌కు ఎస్‌ఇఎం కోర్టుచురకలు



**న్యూఢిల్లీ, అక్టోబరు 24:** కాక్రోచ్ జనతా పార్టీ కో కన్వీనర్ సౌరవ్ దాస్‌కు స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కోర్టులో చుక్కెదురైంది. శాంతి ఒప్పందం దాఖలు ప్రక్రియ సందర్భంగా ఢిల్లీలో సౌరవ్ దాస్ నివాసానికి సంబంధించిన రుజువుల్ని సమర్పించాలని కోర్టు ఆదేశించింది. సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలు కొన్ని రోజుల క్రితం షరతులతో కూడిన బెయిల్‌పై విడుదలయ్యారు. ఈనెల 10న వీరిద్దరు సంతకం చేసిన పీస్ బాండ్‌ను ఉల్లంఘించి, ఆంక్షలు ఉన్నప్పటికీ జంతర్ మంతర్ వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. 13న వీరిద్దర్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కోర్టు వీరిద్దరికి జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. 7 రోజుల తర్వాత బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో సౌరవ్ దాస్ నివాసానికి సంబంధించిన రుజువుల్ని కోర్టు కోరింది. శనివారం జరిగిన కోర్టు విచారణల్లో అద్దె ఒప్పందం, దస్తావేజు లేదా లీజుకు సంబంధించిన ఎలాంటి పత్రాలను కూడా సౌరవ్ దాస్ సమర్పించలేదని కోర్టు గుర్తించింది. దాస్, రాంకాలు ఇద్దరు తమ పూచీదారులతో కలిసి శనివారం కోర్టు ముందు హాజరయ్యారు. పత్రాల పరిశీలన కోసం కోర్టు ఈ కేసును నవంబర్ 17కు వాయిదా వేసింది. ఇదిలా ఉంటే, నిరసనలకు సంబంధించిన కేసులో మరో నిందితురాలుగా ఉన్న ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ నేత నేహా బోరాకు ఢిల్లీ హైకోర్టులో ఉపశమనం లభించలేదు. ఎస్‌ఇఎం కోర్టు పీస్ బాండ్ పై సంతకం చేయాలని ఆదేశించారు.

## సమాజ అభివృద్ధిలో మహిళా జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకం

### శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**హైదరాబాద్,అక్టోబరు24,ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని మీడియా అకాడమీలో అఖిల భారత మహిళా జర్నలిస్టుల సమ్మేళనంలో భాగంగా శనివారం సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా జర్నలిస్టులు శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మహిళా జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమైనదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా నాలుగో స్తంభంగా నిలుస్తుందని, ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు విశేషమైన పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.

ముఖ్యంగా మహిళా జర్నలిస్టులు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ వృత్తిపట్ల అంకితభావంతో పనిచేయడం అభినందనీయమని పేర్కొన్నారు. మహిళలు నేడు విద్య, వైద్యం, సాంకేతిక పరిజ్ఞానం, పరిపాలన, రాజకీయాలు, మీడియా తదితర అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటున్నారని అన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళా జర్నలిస్టులు ఒకే వేదికపై సమావేశమై తమ అనుభవాలను, ఆలోచనలను పంచుకోవడం ఎంతో సంతోషకరమైన విషయమని తెలిపారు.

తెలంగాణ రాష్ట్రం గొప్ప సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమని, బతుకమ్మ, బోనాలు వంటి పండుగలు తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకలని పేర్కొన్నారు. మన కళలు, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. మహిళా జర్నలిస్టుల సమ్మేళనంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని, ఇటువంటి కార్యక్రమాలు దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య సాంస్కృతిక అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.

## ఎవరి శాంతి కోసం పీస్‌బాండ్‌పై సంతకం?

### పోలీసుల తీరుపై విద్యార్థి నేత నేహా బోరా

**న్యూఢిల్లీ, అక్టోబరు 24:** ఢిల్లీ పోలీసులు జారీ చేసిన పీస్ బాండ్ అంటే శాంతి పత్రంపై సంతకం చేసేందుకు అఖిల భారత విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షురాలు నేహా బోరా నిరాకరించారు. నిరసన తెలిపే ప్రాథమిక హక్కును అణచివేసేందుకే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆమె ఆరోపించారు. ఈ బాండ్ పై సంతకం చేసి నేను ఎవరి శాంతిని కాపాడాలి అని ఆమె సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం ఢిల్లీలోని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్లమెంటరీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు, ఎన్నికల ప్రధాన కమిషనర్‌ను ప్రశ్నించడం వంటి అంశాలపై అక్టోబర్ 16న మండీ హౌస్ వద్ద జరిగిన నిరసనలో పాల్గొన్నప్పుడు తనను అదుపులోకి తీసుకున్నారని నేహా బోరా తెలిపారు. అనంతరం, భారతీయ నాగరిక సురక్షా సంహిత సెక్షన్ 126 కింద ఢిల్లీ పోలీసులు ఈనెల 17న తనకు నోటీసులు జారీ చేశారని చెప్పారు. విచారణ సమయంలో శాంతికి భంగం కలిగించకుండా ఉండేందుకు రూ.10 వేల వ్యక్తిగత బాండ్‌తో పాటు ఒకరి పూచీకత్తు సమర్పించాలని ఆ నోటీసులో పేర్కొన్నారని వివరించారు. ప్రజాస్వామ్య నిరసనలను అరికట్టేందుకు శాంతి బాండ్లను ఒక ఆయుధంగా వాడుతున్నారు. ఈ బాండ్‌పై సంతకం చేస్తే, నిరసన తెలిపే రాజ్యాంగబద్ధ హక్కును స్వయంగా వదులుకున్నట్లే అవుతుంది. అందుకే నేను సంతకం చేయబోనని నేహా బోరా స్పష్టం చేశారు. ఆందోళన సమయంలో తాము శాంతికి భంగం కలిగించలేదని, పోలీసులే లాఠీఛార్జ్ చేయడం, మహిళల దుస్తులు చించడం, జర్నలిస్టులపై దాడికి పాల్పడటం వంటి హింసకు దిగారని ఆమె ఆరోపించారు.





శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ

## డిండి ఉరితాడును సిఎం రేవంత్ బిగిస్తున్నారు

### మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ

**హైదరాబాద్,అక్టోబరు24,ప్రభాతవార్త:** బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పాలమూరు మెడకు వేసిన 'డిండి ఉరితాడు'ను ఇప్పుడు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి బిగిస్తున్నారని బిజెపి సీనియర్ నాయకురాలు, మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలమూరు ప్రజలపై ప్రేమ లేదని పేర్కొన్నారు. శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో అన్నారు. పాలమూరు రైతుల గొంతు నులిమేలా డిండి లిఫ్ట్ కుట్రలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాలమూరు ప్రజల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన రేవంత్ రెడ్డి సొంత జిల్లా రైతులకే ద్రోహం తలపెట్టడం దుర్మార్గమని అరుణ విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగం కాని డిండి లిఫ్ట్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి వచ్చే ప్రతి నీటి బొట్టూ పాలమూరుకే దక్కాలని అన్నారు. నల్లగొండకు నీరు ఇచ్చేందుకు ఎస్‌ఎల్‌బీసీ, నక్కలగండి వంటి ప్రత్యామ్నాయ మార్గాలు ఉండగా పాలమూరు హక్కులను కాలరాయడం ఎందుకని ప్రశ్నించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును కాంగ్రెస్ హయాంలోని జీవో 72 ప్రకారం జూరాల ఆధారిత పాత డిజైన్‌తోనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పాలమూరు జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నోరు మెదపకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఎంపీ అరుణ హెచ్చరించారు. పాలమూరు జిల్లాలోని నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తి, కోయిల్‌సాగర్, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులు దశాబ్దకాలంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వచ్చి మూడేళ్లు గడుస్తున్నా రిజర్వాయర్లలో పూడిక తీయలేదని, మరమ్మతులు చేపట్టలేదని మండిపడ్డారు. ఆర్డీఎస్ కింద ఉన్న 15.9 టీఎంసీలు, జూరాల కింద ఉన్న 17.84 టీఎంసీల కేటాయింపులను కూడా పూర్తి స్థాయిలో ఒడిసిపట్టలేక వరద నీటిని దిగువకు వదిలేస్తున్నారని ఆరోపించారు. జూరాల ప్యారలల్ ప్రాజెక్టు, బ్రిడ్జి పనులకు నిధులు కేటాయించకుండా, నియోజకవర్గానికి లక్ష ఎకరాల చొప్పున సాగునీరు ఇచ్చే సమగ్ర కార్యాచరణ లేకుండా కొడంగల్, నారాయణపేటకే అరకొరగా పరిమితం చేస్తున్నారని విమర్శించారు. పాలమూరు రైతుల ప్రయోజనాల కోసం రాజీలేని ప్రజాపోరాటం చేస్తామని ఎంపీ అరుణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఎకరాకూ సాగునీరు అందించాలనే లక్ష్యంతో జూరాల ప్రాజెక్టు ఆధారంగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సర్వే కోసం జీవో నంబర్ 72ను తీసుకొచ్చిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. నాడు కేసీఆర్ పాలమూరు రైతుల మెడకు ఉరితాడు వేస్తే, ఎమ్మెల్యేలతో కలిసి పెద్ద ఎత్తున పోరాడి ఆ పనులను అడ్డుకున్నామని తెలిపారు.

# గచ్చిబౌలిలో లెదర్ కామన్ ఫెసిలిటీ సెంటర్

### డిజైనింగ్ నుంచి బ్రాండింగ్ వరకు ఆర్టిజన్లకు మార్గనిర్దేశం

### రుక్మాపూర్‌లో పర్యావరణహిత చర్మశుద్ధి కర్మాగారాలు

### టిజిఎల్ఐపిసి సమీక్షా సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్,అక్టోబరు24,ప్రభాతవార్త:** రాష్ట్రంలో లెదర్ ఇండస్ట్రీని మరింత బలోపేతం చేయడంతో పాటు, ఔత్సాహిక ఎస్సీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు గచ్చిబౌలిలో ప్రత్యేకంగా కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్‌సీ)ను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రుక్మాపూర్ లో సుమారు వేయి మందికి ఉపాధి కల్పించేలా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పర్యావరణహిత చర్మశుద్ధి కర్మాగారాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శనివారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో తెలంగాణ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పోరేషన్(టీజీఎల్ఐపీసీ) ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో లెదర్ ఇండస్ట్రీ అభివృద్ధికి, ఆర్టిజన్లను ప్రోత్సహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఎస్సీ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు.

అంతర్జాతీయ హంగులతో గచ్చిబౌలీలో హబ్ అండ్ స్పోక్ విధానంలో మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్న సీఎఫ్‌సీ ద్వారా రాష్ట్రంలోని ఆర్టిజన్ల ఉత్పత్తులకు అదనపు విలువ(వాల్యూ యాడెడ్)ను జోడిస్తామన్నారు. డిజైనింగ్ మొదలు బ్రాండింగ్ వరకు వారికి మార్గనిర్దేశం చేస్తామన్నారు. హుజురాబాద్ నియోజకవర్గం జమ్మికుంట, ఆర్మూర్ లో మైక్రో స్మాల్ ఎంటర్ ప్రైజెస్ క్లస్టర్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం (ఎంఎస్ఈసీడీపీ) కింద ప్లగ్ అండ్ ప్లే విధానంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో లిడ్ క్యాప్ కు ఎక్కడెక్కడ భూములు కేటాయించారు.

వాటి ప్రస్తుత పరిస్థితి ఏంటనే అంశంపై క్షేత్రస్థాయిలో పరిశీలించిన నివేదిక అందజేయాలని సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, టీజీఎల్ఐపీసీ వీసీ అండ్ ఎండీ ప్రశాంత్ కుమార్, తెలంగాణ స్టేట్ లెదర్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ప్రెసిడెంట్ డా.ఆరేపల్లి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



శనివారం సచివాలయంలో తెలంగాణ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పోరేషన్ ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

## జూనియర్ లెక్చరర్ల విద్యార్హతలపై మళ్లీ విచారణ

### నకిలీ సర్టిఫికేట్లు సమర్పించిన 50 మందిపై ఇప్పటికే చర్యలు

**హైదరాబాద్,అక్టోబరు24,ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న జూనియర్ లెక్చరర్ల విద్యార్హత ధృవపత్రాలపై ఇంటర్మీడియట్ విద్యాశాఖ మరోసారి విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టింది. నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందినవారిని గుర్తించడంపై అధికారులు దృష్టి సారించారు. ప్రస్తుతం సుమారు 800 మంది లెక్చరర్ల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి కావాల్సి ఉండగా.. వీరిలో ఇతర రాష్ట్రాల విశ్వవిద్యాలయాల నుంచి పీజీ చేసిన సుమారు 250 మంది ధృవపత్రాలను ప్రత్యేకంగా తనిఖీ చేస్తున్నారు. ఇప్పటికే నకిలీ సర్టిఫికెట్లు సమర్పించినట్లు విచారణలో నిర్ధారణ అయిన 50 మందిని సర్వీసు నుంచి తొలగించినట్లు అధికారులు వెల్లడించారు.

మిగిలిన తనిఖీలను రెండు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 2023 ఏప్రిల్‌లో సుమారు 3200 మంది కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేశారు. ఆ సమయంలో విద్యార్హత సర్టిఫికెట్ల పరిశీలన సమగ్రంగా జరగలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం సర్వీసు కన్ఫర్మేషన్ ప్రక్రియలో భాగంగా ధృవపత్రాలను మరోసారి పరిశీలిస్తుండటంతో ఈ వ్యవహారం ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల విశ్వవిద్యాలయాల నుంచి దూరవిద్య విధానంలో పొందిన పీజీ సర్టిఫికెట్ల ప్రామాణికతపై అధికారులు దృష్టి సారించారు. కొంతమంది లెక్చరర్లు సమర్పించిన విద్యార్హత పత్రాలపై అనుమానాలు వ్యక్తం కావడంతో సంబంధిత విశ్వవిద్యాలయాల నుంచి జెన్యూనిటీ సర్టిఫికెట్లు తీసుకురావాలని అధికారులు సూచించారు.

అయితే, కొందరు విశ్వవిద్యాలయాల పేరుతో నకిలీ లెటర్‌హెడ్లు, స్టాంపులను ఉపయోగించి ధ్రువీకరణ పత్రాలు తయారు చేయించి సమర్పించినట్లు తనిఖీల్లో గుర్తించినట్లు సమాచారం. దీంతో ఇంటర్మీడియట్ విద్యాశాఖ సంబంధిత విశ్వవిద్యాలయాలకు లేఖలు రాసి సర్టిఫికెట్ల నిజానిజాలను నిర్ధారించాలని కోరింది. స్పందన రాని కొన్ని చోట్లకు ప్రత్యేక బృందాలను పంపి వివరాలు సేకరించింది. కొన్ని విశ్వవిద్యాలయాలు తాము ఆ సర్టిఫికెట్లను జారీ చేయలేదని, మరికొన్ని తమ వద్ద సంబంధిత కోర్సులే లేవని తెలిపినట్లు అధికారులు గుర్తించారు. విశ్వవిద్యాలయాల నుంచి అందుతున్న నివేదికలు, ఇతర ఆధారాల ఆధారంగా ఇప్పటివరకు 50 మందిపై చర్యలు తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన సర్టిఫికెట్ల పరిశీలనను రెండు నెలల్లో పూర్తి చేసి, నకిలీ పత్రాలు సమర్పించినట్లు నిర్ధారణ అయినవారిపై సర్వీసు పరమైన చర్యలతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశముంది. అయితే.. ప్రతి కేసులోనూ సంబంధిత ధ్రువపత్రాల ప్రామాణికతను అధికారికంగా నిర్ధారించిన తర్వాతే తుది చర్యలు తీసుకోనున్నారు. కాంట్రాక్టు నుంచి రెగ్యులరైన లెక్చరర్ల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కొనసాగుతోందని ఇంటర్మీడియట్ విద్యాశాఖ డైరెక్టర్ అభిలాష అభినయ్ తెలిపారు. పూర్తిస్థాయి ఆధారాలు సేకరించిన తర్వాత షోకాజ్ నోటీసులు జారీ చేసి.. నిబంధనల ప్రకారం సర్వీసు నుంచి తొలగింపు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ఇంకా సుమారు 800 మంది సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి కావాల్సి ఉందని, రెండు నెలల్లో ఈ ప్రక్రియను ముగిస్తామని వెల్లడించారు. నకిలీ ధృవపత్రాలతో ఉద్యోగాలు పొందినవారు ఉన్నట్లు తేలితే వారిని సర్వీసు నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు.

## టిజిపిఎస్సీ ఎఇఇ పరీక్ష వాయిదా వేయాలి

### సిఎం రేవంత్‌కు హరీశ్‌రావు లేఖ

**హైదరాబాద్,అక్టోబరు24,ప్రభాతవార్త:** నవంబర్ 6న జరగనున్న టీజీపీఎస్సీ ఏఈఈ పరీక్షను వెంటనే వాయిదా వేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బిఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు శనివారం బహిరంగ లేఖ రాశారు. ఎస్ఎస్సీ జేఈ, టీజీపీఎస్సీ ఏఈఈ పరీక్షలు ఒకే తేదీన ఉండటంతో వేలాది మంది తెలంగాణ ఇంజినీరింగ్ అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎస్ఎస్సీ జేఈ పరీక్ష రాసే అభ్యర్థులు వెంటనే తెలంగాణకు తిరిగొచ్చి ఏఈఈ పరీక్ష రాయడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. పరీక్షల తేదీలు మార్చాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా టీజీపీఎస్సీ స్పందించలేదని హరీశ్ రావు అన్నారు. పరీక్షల తేదీలను పునఃపరిశీలించాలని అక్టోబర్ 14న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి టీజీపీఎస్సీకి లేఖ రాశారని గుర్తు చేశారు. భేషజాలకు పోయి నిరుద్యోగ యువత భవిష్యత్తును బలి చేయొద్దని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. తక్షణమే సీఎం జోక్యం చేసుకుని నవంబర్ 6న జరగనున్న టీజీపీఎస్సీ ఏఈఈ (సివిల్) పరీక్షను వాయిదా వేయాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి గందరగోళం పునరావృతం కాకుండా ప్రభుత్వం, టీజీపీఎస్సీ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## కండ్లకోయలోని హాస్టల్‌లో బిటెక్ విద్యార్థిని బలవన్మరణం

**మేడ్చల్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** ఉన్నత చదువులు చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎన్నో ఆశలు పెట్టుకున్న ఓ యువతి జీవితం అర్థాంతరంగా ముగిసింది. కండ్లకోయలో ఈ విషాద ఘటన అందరినీ కలచివేసింది. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలోని సాతెల్లి గ్రామానికి చెందిన జంగిటి అక్షయ (19) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, మేడ్చల్ సర్కిల్ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ ఐటీ కళాశాలలో బీటెక్ ఈసీఈ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. చదువు కోసం కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ కండ్లకోయలోని ప్రైవేట్ హాస్టల్‌లో నివసిస్తోంది. అక్షయ శనివారం హాస్టల్ గదిలో విగతజీవిగా కనిపించడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఆమె హాస్టల్ గదిలో ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. తల్లిదండ్రులకు ఈ ఘటన తీరని వేదనను మిగిల్చింది. సమాచారం అందుకున్న మేడ్చల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహేందర్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి, ఘటనపై కేసు నమోదు చేశారు. అక్షయ మరణానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



అక్షయ (ఫైల్)

## ఎపిలో ఏడుగురు 'రెబెల్స్'పై టిడిపి సస్పెన్షన్ వేటు

### కూటమి ధర్మానికి విరుద్ధంగా వ్యవహరించారని పార్టీ ప్రకటన

**విజయవాడ,అక్టోబరు 24,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల వేళ టీడీపీ క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. విజయవాడ కార్పొరేషన్‌లో కూటమి ధర్మానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ, రెబల్స్‌గా పోటీ చేస్తున్న ఏడుగురు నేతలను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. సస్పెండైన వారిలో కాకొల్లు మహేంద్రనాథ్ (బాబీ), దేవరపు మాల్యాద్రి, గెద్దం శ్రీనివాసరావు, కోట నారాయణ, చంద్రశేఖర్, కొమ్మినేని సురేశ్, మాదాల సత్యవతి ఉన్నారు. ఈ నేతలతో టీడీపీకి ఇకపై ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా పోటీ చేస్తున్నాయి. ఈక్రమంలో విజయవాడ కార్పొరేషన్‌లోని కొన్ని డివిజన్లను పొత్తులో భాగంగా జనసేన, బీజేపీలకు కేటాయించారు. టీడీపీ నుంచి టికెట్ ఆశించిభంగపడిన కొందరు నేతలు అసంతృప్తికి గురై రెబల్స్‌గా, స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగారు. ముఖ్యంగా 69వ డివిజన్‌ను కూటమి ఒప్పందంలో భాగంగా జనసేన పార్టీకి కేటాయించారు. అక్కడ టీడీపీ టికెట్ ఆశించిన కాకొల్లు మహేంద్రనాథ్ (బాబీ) పార్టీ ఆదేశాలను ధిక్కరించి రెబల్‌గా నామినేషన్ వేశారు. నామినేషన్ ఉపసంహరించుకోవాలనిపార్టీ సూచించినా ఆయన పట్టించుకోలేదు. 1వ డివిజన్‌లో టీడీపీ అధికారిక అభ్యర్థి గుడిపాటి సౌజన్య, భార్యకు టికెట్ ఆశించిన కొమ్మినేని సురేశ్, మాదాల సత్యవతి వంటివారు స్వతంత్రులుగా పోటీకి దిగారు. ఈ రెబల్ అభ్యర్థులకు సహకరిస్తున్న వారిని కూడా పార్టీ గుర్తించింది. మహేంద్రనాథ్‌తో పాటు ఆయనకు మద్దతిస్తున్న దేవరపు మాల్యాద్రి, గెద్దం శ్రీనివాసరావు, కోట నారాయణ, చంద్ర శేఖర్‌లను కూడా పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. కూటమి ధర్మాన్ని పాటించని వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఈ చర్యల ద్వారా పార్టీ అధిష్ఠానం స్పష్టమైన సంకేతాలు పంపింది.

## పిటి స్వామి మృతికి కెసిఆర్ సంతాపం

**హైదరాబాద్,అక్టోబరు24,ప్రభాతవార్త:** ఉమ్మడి కరీంనగర్ జిల్లా, గోదావరిఖని ప్రాంతానికి చెందిన ప్రముఖ విద్యావేత్త, రాజకీయ సామాజిక సేవా రంగాలలో విశేష కృషి చేసి తనదైన ముద్రవేసుకున్న పి టి స్వామి మరణం పట్ల బి ఆర్ ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, సంతాపం ప్రకటించారు. నాటి టీ ఆర్ ఎస్ ఆవిర్భావం నుంచి తెలంగాణ మలి దశ ఉద్యమం లో గోదావరిఖని ప్రాంతం నుంచి తనతో కలిసి పనిచేసిన పి టి స్వామి తో తనకున్న అనుబంధాన్ని కేసీఆర్ ఈ విషాద సందర్భంలో స్మరించుకున్నారు. విద్యారంగం, రాజకీయరంగం తో పాటు, సామాజిక సేవారంగంలో సుదీర్ఘ అనుభవం కలిగి నిస్వార్థంతో జీవించిన గొప్ప మనిషి, బహుముఖ ప్రజ్ఞాశాలి, పి టి స్వామి అని కేసీఆర్ కొనియాడారు. నిజాయితీతో కూడిన పీటీ స్వామి కార్యాచరణ, లక్ష్య సాధన కోసం వారి పట్టుదల, కృషి, సేవాదృక్పథం, రాజనీతిజ్ఞత రేపటి తెలంగాణ తరాలకు ఆదర్శనీయమన్నారు. వారి మరణం సామాజిక రాజకీయ రంగాలకు తీరని లోటనీ కేసీఆర్ అన్నారు.

## 30న పిఎం కిసాన్ నిధుల విడుదల

### రాష్ట్రంలో 31 లక్షల మంది రైతులకు రూ.623 కోట్లు

**హైదరాబాద్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం తదుపరి విడత కోసం ఎదురుచూస్తున్న కోట్లాది మంది రైతులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఈ పథకం కింద 24వ విడత నిధులను ఈ నెల 30న అధికారికంగా విడుదల చేయనున్నట్లు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. గతంలో 23వ విడత పంపిణీ జరిగి నాలుగు నెలలు దాటడంతో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 25న వారణాసి పర్యటన సందర్భంగానే ఈ నిధులు విడుదలవుతాయని విస్తృతంగా ప్రచారం సాగింది. అయితే, దీపావళిని పురస్కరించుకుని ఈ నెల 30నే రూ.2 వేలు రైతుల ఖాతాల్లో డిబిటి ద్వారా జమ కానున్నాయి. 24వ విడతలో భాగంగా దేశ వ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతుల ఖాతాల్లో సుమారు రూ.18,880 కోట్లు బదిలీ కానున్నాయి. దీనికి సంబంధించి తెలంగాణలో పీఎం కిసాన్ పథకం ద్వారా దాదాపు 31 లక్షల మందికి పైగా అర్హులైన రైతులు ప్రయోజనం పొందుతున్నారు. గతంలో రాష్ట్రంలో ఈ లబ్ధిదారుల సంఖ్య 70 లక్షల నుంచి 80 లక్షల వరకు ఉండేది, కానీ ఆధార్ అనుసంధానం, భూముల రికార్డుల ప్రక్షాళన తర్వాత అర్హులైన రైతుల సంఖ్య తెలంగాణ మొత్తం మీద 31,15,499 గా నిర్ధారించారు. దీంతో రాష్ట్రంలోని రైతులకు రూ.623 కోట్ల మేర పిఎం కిసాన్ పథకం ప్రయోజనాలను పొందనున్నారు.

## రాష్ట్రానికి నిలిచిన ఆర్థిక సంఘం నిధులు

### జిల్లా పరిషత్ ఎన్నికలు లేకపోవడతో నిలుపుదల

**హైదరాబాద్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** జడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీ కాలం ముగిసి రెండేళ్లు దాటినా వాటికి ఎన్నికలు జరగకపోవడంతో కేంద్రం ఆర్థికసంఘం నిధులు నిలిచిపోయాయి. జిల్లా పరిషత్, మండల పరిషత్‌లలో ప్రత్యేకాధికారుల పాలన అమలులోకి వచ్చింది. అప్పటి నుంచి ఆరు నెలల కొకసారి పొడిగిస్తూనే ఉన్నారు. పంచాయతీ ఎన్నికల అనంతరం మండల, జిల్లా పరిషత్‌లకు ఎన్నికల నిర్వహణ కోసం రిజర్వేషన్లు ఖరారు చేసి ప్రక్రియ కూడా మొదలైన తరువాత ఎన్నికలు వాయిదా పడ్డాయి. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుదల అంశం కొలిక్కి రాకపోవడంతో ఎన్నికలను వాయిదా వేశారు.

ఆ తర్వాత మళ్లీ ఆ ఎన్నికల ప్రక్రియ ఊసే లేకుండా పోయింది. ఆర్థిక సంఘం (2026-27 నుండి 2030-31 వరకు) ఐదేళ్ల కాలానికి తెలంగాణలోని గ్రామీణ స్థానిక సంస్థలకు (గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు) అభివృద్ధి కోసం రూ.9,968 కోట్లు కేటాయించింది. మొత్తం మీద గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి తెలంగాణకు రూ.21,517 కోట్లు కేటాయించినట్లు కేంద్రం ప్రకటించింది.

## మక్కా, మదీనా వైపు హౌతీ క్షిపణులు

### సౌదీ అరేబియాలో హైఅలర్ట్!

### సౌదీ చమురు క్షేత్రాలు, విమానాశ్రయాలు, సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేశాం : హౌతీలు

**రియాద్, అక్టోబరు 24:** యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు మక్కా, మదీనా నగరాల దిశగా ప్రయోగించిన రెండు బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకున్నట్లు సౌదీ అరేబియా పౌర రక్షణ విభాగం శనివారం వెల్లడించింది. అడ్డుకున్న క్షిపణులకు సంబంధించిన శకలాలు మక్కా సమీప ప్రాంతంలో పడినట్లు తెలిపింది. మరోవైపు, సౌదీ అరేబియాలోని పలు చమురు కేంద్రాలు, విమానాశ్రయాలు, సైనిక స్థావరాలపై దాడులు చేసినట్లు హౌతీలు ప్రకటించారు. సౌదీ అరేబియాలోని ఈస్ట్-వెస్ట్ ముడిచమురు పైప్‌లైన్, పలు పంపింగ్ స్టేషన్లు, రాబిగ్ చమురు శుద్ధి కర్మాగారం, యన్బూలోని సౌదీ ఆరామ్‌కో సంస్థకు చెందిన సదుపాయాలను లక్ష్యంగా చేసుకున్నట్లు హౌతీలు పేర్కొన్నారు. అలాగే దమ్మామ్‌లోని కింగ్ ఫహద్ అంతర్జాతీయ విమానాశ్రయం, నజ్రాన్ విమానాశ్రయం, ఖమీస్ ముషైత్ వైమానిక స్థావరం, రియాద్‌లోని కింగ్ ఖాలిద్ విమానాశ్రయంపైనా దాడులు చేసినట్లు హౌతీ సైనిక ప్రతినిధి యాహ్యా సారీ వెల్లడించారు. యెమెన్‌లో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రభుత్వానికి తాత్కాలిక కేంద్రంగా ఉన్న ఏడెన్‌లోని అల్‌నస్ర్ శిబిరం, నౌకాదళ స్థావరంలో ఉన్న సౌదీ సైనిక బలగాలను లక్ష్యంగా చేసుకున్నట్లు సారీఅ మరో ప్రకటనలో తెలిపారు.



అయితే, యెమెన్ అంతర్గత వ్యవహారాల శాఖ ప్రకారం, ఈ దాడిలో తీర రక్షక దళ ప్రధాన కార్యాలయం, మరో ప్రాంతంలోని తీర రక్షక దళ భవనం దెబ్బతిన్నాయి. ఈ వివరాలను సబా వార్తా సంస్థ వెల్లడించింది. విమానాశ్రయానికి సమీపంలోని సైనిక శిబిరం గురించి ఆ శాఖ ప్రస్తావించలేదు. సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు శనివారం పశ్చిమ సౌదీ అరేబియాలోని తాయిఫ్, యన్బూ నగరాలను లక్ష్యంగా చేసుకున్న రెండు క్షిపణులను అడ్డుకున్నట్లు అంతకుముందు ప్రకటించాయి. తాయిఫ్, యన్బూ, మక్కా సహా పశ్చిమ ప్రాంతాల్లోని నాలుగు ప్రాంతాలకు సౌదీ పౌర రక్షణ విభాగం అప్రమత్తత హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు సమీపంలోని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది. కొన్ని నిమిషాల తర్వాత ఈ హెచ్చరికలను ఉపసంహరించుకుంది. క్షిపణులు, డ్రోన్లను అడ్డుకునే చర్యలకు సంబంధించిన చిత్రాలు లేదా సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచుకోవద్దని పౌర రక్షణ విభాగం మరోసారి చట్టపరమైన హెచ్చరిక జారీ చేసింది. ఇటీవలి వారాల్లో సౌదీ అరేబియాలోని చమురు మౌలిక సదుపాయాలు, విమానాశ్రయాలపై హౌతీలు వరుస దాడులు చేసినట్లు ప్రకటిస్తున్నారు. ఎర్ర సముద్ర తీరంలోని యన్బూ ప్రధాన చమురు ఎగుమతి కేంద్రంగా ఉంది. హార్ముజ్ జలసంధిలో ప్రాంతీయ సంఘర్షణల కారణంగా రవాణాకు అంతరాయాలు ఏర్పడుతున్న నేపథ్యంలో, ఈ మార్గం ద్వారా ముడిచమురును తరలించడం సౌదీ అరేబియాకు కీలకంగా మారింది. మరోవైపు, యెమెన్‌లో వైమానిక దాడుల కారణంగా పౌరులు మరణించినట్లు వార్తలు వెలువడ్డాయి.

## బిసి స్టడీ సర్కిల్‌లో స్టైపెండ్ పెంపు

### రూ.5 వేల నుండి రూ.7 వేలకు..

**హైదరాబాద్, అక్టోబరు 24, ప్రభాతవార్త:** హైదరాబాద్ సైదాబాద్‌లోని బీసీ స్టడీ సర్కిల్లో సివిల్ సర్వీసెస్ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఇక్కడ కోచింగ్ తీసుకుంటున్న 100 మంది అభ్యర్థులకు నెలకు ఇచ్చే స్టైపెండ్‌తో పాటు, పాటు బుక్ ఫండ్‌ను భారీగా పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు నెలకు రూ.5,000గా ఉన్న స్టైపెండ్ రూ.7,000కి పెంచగా, పుస్తకాల కొనుగోలు కోసం ఇచ్చే వన్‌టైమ్ బుక్ ఫండ్‌ను రూ.5,000 నుంచి రూ.10,000కు రెట్టింపు చేసింది. ఈ పెంచిన ఆర్థిక సాయాన్ని నవంబరు నుండి విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎం హరికృష్ణ వెల్లడించారు.



## సిలికాన్ వ్యాలీ ఓపెన్‌లో అనాహత్ ఓటమి

**రెడ్‌వుడ్ సిటీ:** ఎనిమిదిసార్లు ప్రపంచ ఛాంపియన్ అయిన నూర్ ఎల్ షెర్బినిపై అనూహ్య విజయంతో మొదలైన భారత స్క్వాష్ క్రీడాకారిణి అనాహత్ సింగ్ ప్రచారం, సిలికాన్ వ్యాలీ ఓపెన్ సెమీఫైనల్స్‌లో మలేషియాకు చెందిన శివసంగరి సుబ్రమణియం చేతిలో 5-11, 11-6, 11-4, 11-7 తేడాతో ఓడిపోవడంతో ముగిసింది. 18 ఏళ్ల మూడో సీడ్ మలేషియా ప్లేయర్‌పై అద్భుతమైన ఆరంభం చేసి, తొలి గేమ్‌ను 11-5 తేడాతో గెలుచుకుంది. అయితే, ప్రపంచ నంబర్ 4 సుబ్రమణియం పుంజుకుని తర్వాతి మూడు గేమ్‌లను గెలుచుకుని 37 నిమిషాల్లో మ్యాచ్‌ను తన వశం చేసుకుంది. ఆరంభంలో అనాహత్ ఆధిపత్యం చెలాయించి, ఒక పాయింట్ వెనుకబడినప్పటికీ పుంజుకుని, ఆ తర్వాత వరుసగా ఎనిమిది పాయింట్లు సాధించి తొలి గేమ్‌లో తిరుగులేని ఆధిక్యాన్ని నెలకొల్పింది. రెండవ గేమ్‌లో సుబ్రమణియం మరింత స్థిరత్వంతో స్పందించి, క్రమంగా పోటీపై పట్టు సాధించింది. 3-7తో వెనుకబడిన తర్వాత, తేడాను ఒక పాయింట్‌కు తగ్గించి, నాలుగవ గేమ్‌లో నిర్ణయాత్మక గేమ్‌కు తీసుకెళ్లాలని అనాహత్ ప్రయత్నించింది, కానీ ఆ మలేషియన్ క్రీడాకారిణి సంయమనం కోల్పోకుండా మ్యాచ్‌ను ముగించింది. ఈ ఫలితం సుబ్రమణియమ్‌కు మరో విజయాన్ని అందించింది. ఆమె 2026 ఐచినగోయా ఆసియా క్రీడల్లో మహిళల సింగిల్స్ ఫైనల్‌లో కూడా అనాహత్‌ను ఓడించింది. అక్కడ సింగిల్స్ ఫైనల్‌కు చేరిన తొలి భారత మహిళగా నిలిచిన అనహత్ రజత పతకాన్ని కైవసం చేసుకుంది.






## ఘనంగా ప్రారంభించిన భారత్

### 4-2 తేడాతో లావోస్ ఓటమి

**బాకు:** బాకులో శనివారం జరిగిన తొలి ఫీఫా అండర్15 ప్రపంచ కప్ 2026, గ్రూప్ కె ఆరంభ మ్యాచ్‌లో లావోస్‌పై 4-2 తేడాతో అద్భుత విజయంతో భారత్ ప్రచారాన్ని ప్రారంభించింది. భారత్ ఆటను ప్రారంభించి తొలి 4 నిమిషాల్లోనే రెండు అవకాశాలను సృష్టించుకుంది. మూడో నిమిషంలో దీపక్ సింగ్ బలంగా కొట్టిన షాట్‌ను లావోస్ గోల్ కీపర్ అనౌసిత్ సౌక్సవాన్ అడ్డుకున్నాడు. భారత్ చివరకు (7వ నిమిషంలో) ఆధిక్యంలోకి వచ్చింది. దీపక్ అద్భుతమైన ఫుట్‌వర్క్‌తో బంతిని నెట్‌లోకి సునాయాసంగా పంపాడు. లావోస్ క్లియరెన్స్‌ను (11వ) దీపక్ అడ్డుకోవడంతో లాల్‌రెమ్‌రువాట్‌ఫెలా శక్తివంతంగా గోల్ చేసి భారత జట్టు ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. లావోస్ వెంటనే ఆధిక్యాన్ని తగ్గించింది. అనవిన్ జయ్యాసోన్ (12వ) కొట్టిన షాట్‌కు భారత గోల్ కీపర్ జెనిట్ నింగ్‌తౌజామ్‌కు ఏమాత్రం అవకాశం లభించలేదు. ఆ తర్వాత ఆట వేగం మందగించింది. విరామం తర్వాత భారత్ (21వ) కార్నర్ నుండి వచ్చిన బంతిని మార్క్‌డొనిష్ కొట్టగా అది కొద్దిలో లక్ష్యాన్ని తప్పింది. మూడు నిమిషాల తర్వాత లావోస్ స్కోరును సమం చేసింది. సర్కార్ (31వ) ఇచ్చిన పాస్‌ను లాల్‌రెమ్‌రువాట్‌ఫెలా, గోల్ చేయడంతో స్కోరు 3-2గా మారి భారత్ మళ్లీ ఆధిక్యాన్ని సాధించింది. ఆ తర్వాత (33వ) సర్కార్ అద్భుతమైన లాంగ్‌రేంజ్ షాట్‌తో గోల్‌కీపర్‌పై నుంచి బంతిని నెట్‌లోకి పంపి భారత్ ఆధిక్యాన్ని మరింత పెంచాడు. భారత్ చివరి దశలను సమర్థవంతంగా నిర్వహించి రెండు గోల్స్ ఆధిక్యాన్ని కాపాడుకుని, తమ ప్రచారాన్ని విజయంతో ప్రారంభించింది.

# న్యూజిలాండ్‌పై భారత్ విజయం

## 4 వికెట్ల తేడాతో 2-0 సిరీస్‌లో ఆధిక్యం

**క్రైస్ట్‌చర్చ్,** న్యూజిలాండ్: న్యూజిలాండ్ పర్యటనలో భారత్ జోరు కొనసాగుతోంది. వరుసగా రెండోమ్యాచ్‌లోనూ భారత్ విజయం సాధించింది. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా క్రైస్ట్‌చర్చ్ వేదికగా శనివారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో భారత్ 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. తిలక్ వర్మ(26 బంతుల్లో 6ఫోర్లు, సిక్స్‌తో 51నాటౌట్), నితీష్ కుమార్ (13 బంతుల్లో ఫోర్,సిక్స్‌తో 26 నాటౌట్) అసాధారణ ప్రదర్శనతో అదిరిపోయే విజయాన్ని అందించారు. ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ 2-0తో ఆధిక్యంలోనిలిచింది. ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 5వికెట్లకు 180 పరుగులు చేసింది. గ్లేన్ ఫిలిప్స్(43 బంతుల్లో 4 ఫోర్లు, 4సిక్స్‌లతో 70), బెవాన్ జాకోబ్స్(46 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 58) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్(2/33) రెండు వికెట్లు తీయగా, భువనేశ్వర్ కుమార్(1/50), ప్రిన్స్ యాదవ్(1/30), నితీష్ కుమార్ రెడ్డి(1/31) తలో వికెట్ తీసారు. అనంతరం భారత్ 19.5 ఓవర్లలో 6 వికెట్లకు 181 పరుగులు చేసి గెలుపొందింది. తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డితో పాటు నమన్‌ధీర్(17 బంతుల్లో ఫోర్లు, 2సిక్స్‌లతో 31) రాణించాడు. న్యూజిలాండ్ బౌలర్లలో మిచెల్ సాంట్నర్(4/21) నాలుగు వికెట్లు తీయగా, జాకోబ్ డఫీ, నాథన్ స్మిత్ తలో వికెట్ తీసారు.






**పారిస్:** రెండు సార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు, శనివారం పారిస్‌లోని ఎరీనా గ్రాండ్‌లో జరిగిన హోరాహోరీ మూడుగేమ్‌ల సెమీఫైనల్‌లో జపాన్‌కు చెందిన హినా అకేచిని ఓడించి, బీడబ్ల్యూఎఫ్ ఫ్రెంచ్ ఓపెన్ 2026 మహిళల సింగిల్స్ ఫైనల్‌లోకి దూసుకెళ్లింది. రెండో గేమ్‌లో స్వల్ప తేడాతో ఓటమి నుంచి కోలుకున్న సింధు, 73 నిమిషాల పాటు సాగిన పోరులో 21-10, 20-22, 21-16 తేడాతో విజయం సాధించింది. ఆదివారం జరిగే ఫైనల్‌లో సింధు దక్షిణ కొరియా ప్రపంచ నంబర్ 1 ఆన్ సే యంగ్‌తో తలపడనుంది. 45 నిమిషాల్లో జపాన్‌కు చెందిన నొజోమి ఒకుహారాను 21-12, 21-19 తేడాతో ఓడించి ఆన్‌సే యంగ్ టైటిల్ పోరులోతన స్థానా న్ని ఖరారు చేసుకుంది. కాగా సింధు సెమీఫైనల్ తొలి గేమ్‌ను 21-10 తేడాతో కైవసం చేసుకుంది. అయితే, అకేచి రెండో గేమ్‌లో పుంజుకుని, పోటీలో చాలాసేపు తన ఆధిక్యాన్ని కొనసాగించింది. సింధు కొద్దిసేపు 16-16తో స్కోరును సమం చేసి, 2పాయింట్ల ఆధిక్యంలోకి వెళ్ళింది. కానీ, ఈ జపనీస్ షట్లర్ తిరిగి పుంజుకుని గేమ్‌ను 22-20 తేడాతో గెలిచి, నిర్ణయాత్మక గేమ్‌కు దారితీసింది. మూడవ గేమ్ కూడా అంతే పోటీగా సాగింది, ఇద్దరు క్రీడాకారులు పాయింట్లు పంచుకున్నారు. నిర్ణయాత్మక గేమ్‌లో చాలా వరకు సింధు ఆధిపత్యం చెలాయించినట్లు కనిపించినా, అకేచి పుంజుకుని స్కోరును 14-14తో సమం చేసి, 16-15 ఆధిక్యాన్ని సాధించింది, సింధు వరుసగా ఆరు పాయింట్లు గెలుచుకుని, 21-16 తేడాతో గేమ్‌ను ముగించి, ఫైనల్‌లో తన స్థానాన్ని సురక్షితం చేసుకుంది.

## ఆసియా పారా గేమ్స్‌లో భారత్‌కు 114 పతకాలు

**నగోయా:** జపాన్‌లో ఏడు రోజుల పాటు ఉత్కంఠభరితంగా సాగిన 2026 ఐచి నగోయా ఆసియా క్రీడల్లో, భారత్ 114 పతకాలతో శనివారం తన అత్యుత్తమ ప్రచారాన్ని ముగించింది. భారత్ 30 స్వర్ణాలు, 35 రజతాలు, 49 కాంస్యాలతో మొత్తం పతకాల పట్టికలో నాల్గవ స్థానంలో నిలిచింది. గతంలో కంటే దాదాపు సగం మంది సభ్యులతోనే బరిలోకి దిగినప్పటికీ, 2023 హాంగ్‌జౌ క్రీడలలో సాధించిన పతకాలతో పోలిస్తే ఇది మూడు పతకాల మెరుగుదలను సూచిస్తుంది. పారా అథ్లెటిక్స్ కార్యక్రమంలో వచ్చిన బలమైన పురోగతి నిర్ణయాత్మకమైంది. ఈ విభాగంలో భారత అథ్లెట్లు 22 స్వర్ణాలతో సహా 65 పతకాలను కైవసం చేసుకున్నారు, ఇది చివరి రెండు రోజులలో దేశాన్ని పతకాల పట్టికలో ఆరవ స్థానం నుండి నాల్గవ స్థానానికి చేర్చింది. ఈ బృందం అనేక అద్భుతమైన ప్రదర్శనలు కనబరచగా, నలుగురు అథ్లెట్లు తలా మూడు పతకాలు సాధించారు. వారిలో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ శీతల్ దేవి కూడా ఉన్నారు. 2026 ఆసియా క్రీడల్లో అత్యధిక పతకాలు గెలుచుకున్న భారత అథ్లెట్ల జాబితాలో పారా ఆర్చర్ శీతల్ దేవి తాను పోటీపడిన మూడు ఈవెంట్లలోనూ 2 బంగారం, 1 వెండిపతకాలు సాధించింది. తులసిమతి మురుగేషన్ (1 స్వర్ణం, 2 రజతం) భారతదేశపు అత్యంత నిలకడైన మహిళా పారాబ్యాడ్మింటన్ క్రీడాకారిణులలో ఒకరైన తులసిమతి, తాను పోటీపడిన మూడు ఈవెంట్లలోనూ పతకాలను కైవసం చేసుకుంది. 19 ఏళ్ల పారాస్విమ్మర్ రవి కార్తీక్ బుడిగిన జపాన్‌లో జరిగిన తన తొలి పోటీలోనే అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, తాను పోటీపడిన ఆరు ఈవెంట్లలో 2 రజతాలు, 1 కాంస్యం కైవసం చేసుకున్నాడు. మరో పారా స్విమ్మర్ అయిన హిమాంశు నందల్ స్విమ్మింగ్‌లో ఆరు ఈవెంట్లలో 3 కాంస్య పతకాలు సాధించాడు.



## కోటక్ మహీంద్రా బ్యాంక్‌కు క్యూ2లో 29.48% లాభవృద్ధి

# రూ.4,212 కోట్లకు చేరిన నికర లాభం..

**ముంబయి,అక్టోబరు 24:** కోటక్ మహీంద్రా బ్యాంక్ రెండో త్రైమాసికంలో నికర లాభం 29.48 శాతం పెరిగి రూ.4,212 కోట్లకు చేరింది. మరోవైపు, స్థూల, నికర నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) నిష్పత్తులు త్రైమాసిక, వార్షిక ప్రాతిపదికన తగ్గడంతో ఆస్తుల నాణ్యత కూడా మెరుగుపడింది. బ్యాంక్ నికరవడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) గతఏడాది ఇదే త్రైమాసికంలోని రూ.7,311 కోట్ల నుంచి 15.7 శాతం పెరిగి రూ.8,459 కోట్లకు చేరింది. అంతకుముందు త్రైమాసికంతో పోలిస్తే 6.7 శాతం వృద్ధి నమోదైంది. నికర లాభం గత ఏడాది ఇదే కాలంలోని రూ.3,253 కోట్ల నుంచి రూ.4,211.97 కోట్లకు పెరిగింది. మార్కెట్ అంచనా అయిన రూ.4,128 కోట్లను కూడా అధిగమించింది. ప్రొవిజన్లు, ఇతర కేటాయింపులకు ముందు నిర్వహణ లాభం (ప్రీప్రొవిజన్ ఆపరేటింగ్ ప్రాఫిట్) వార్షిక ప్రాతిపదికన 21.15 శాతం వృద్ధితో రూ.5,268 కోట్ల నుంచి రూ.6,382 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) అంతకుముందు త్రైమాసికంలోని 4.53 శాతం నుంచి 4.31 శాతానికి తగ్గింది. అంటే 22 బేసిస్ పాయింట్ల క్షీణత నమోదైంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 23 బేసిస్ పాయిం ట్లు తగ్గింది. విదేశీకరెన్సీ నాన్‌రెసిడెంట్ బ్యాంక్ (ఎఫ్‌సీఎన్ఆర్(బి)) డిపాజిట్ల సమీకరణ కారణంగానే వడ్డీ మార్జిన్ కొంత తగ్గినట్లు బ్యాంక్ తెలిపింది. ఈడిపాజిట్ల ద్వారా రూ.55,344 కోట్లను సమీకరించగా, అందులో నుంచి రూ. 16,110 కోట్ల రుణాలను మంజూరు చేసింది. ఇదేసమయంలో బ్యాంక్ నిధుల సమీ కరణ




వ్యయం (కాస్ట్ ఆఫ్ ఫండ్స్) అంతకు ముందు త్రైమాసికంలోని 4.46 శాతం నుంచి 4.52 శాతానికి పెరిగింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.18శాతం నుంచి 1.04 శాతా నికి తగ్గింది. నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తి 0.24 శాతానికి చేరింది. అంతకుముందు త్రైమాసికంతో పోలిస్తే మూడు బేసిస్ పాయింట్లు, గత ఏడాదితో పోలిస్తే ఎనిమిది బేసిస్ పాయింట్లు తగ్గింది. ఈ రెండు సూచీల్లోనూ బ్యాంక్ మార్కెట్ అంచనాలను అధిగమించింది. కొత్తగా నిరర్థక ఆస్తులుగా మారిన రుణాల విలువ రూ.1,321 కోట్ల నుంచి రూ.1,230 కోట్లకు తగ్గింది. ఫీజులు, సేవల ద్వారా బ్యాంక్ ఆర్జించిన ఆదాయం గత ఏడాది ఇదే త్రైమాసికంలోని రూ.2,415 కోట్ల నుంచి 21 శాతం పెరిగి రూ.2,926 కోట్లకు చేరింది. మొత్తం ఆస్తులతో పోలిస్తే వ్యయాల నిష్పత్తి (కాస్ట్‌టుఅసెట్స్ రేషియో) కూడా మెరు గుపడింది. అంతకు ముందు త్రైమాసికంలోని 2.66 శాతం నుంచి 2.40 శాతానికి తగ్గింది. కరెంట్ అకౌంట్, సేవింగ్స్ అకౌంట్ డిపాజిట్ల నిష్పత్తి 42.3 శాతం నుంచి 38.2శాతానికి తగ్గింది. ఎఫ్‌సీ ఎన్ఆర్(బి) డిపాజిట్ల రాక దీనికి ప్రధాన కారణమని బ్యాంక్ తెలిపింది.

## మరో నాలుగు బ్యాంకుల్లో షేర్‌సేల్..

**న్యూఢిల్లీ, అక్టోబరు 24:** కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికీ పలు ప్రభుత్వ సంస్థలు, బ్యాంకుల్లో మెజార్టీ వాటా ఉంది. సెబీ నిబంధనల ప్రకారం పబ్లిక్ షేర్ హోల్డింగ్ కనీసం 25 శాతం ఉండాలి. దీంతో 75 శాతానికిపైగా తమ వాటా ఉన్న సంస్థల్లో కేంద్రం క్రమంగా వాటాల్ని విక్రయిస్తూ వస్తోంది. ఒకవైపు ఈ నిబంధనకు తోడు నిధులు సమీకరించాలన్న లక్ష్యంతో మరికొన్ని సంస్థల్లోనూ వాటాల విక్రయం కోసం ఆఫర్ ఫర్ సేల్ నిర్వహిస్తూ వస్తోంది. ఈ ఏడాదిలో ఎల్ఐసీ సహా బీహెచ్ఈఎల్, ఎన్ఎల్‌సి ఇండియా, ఎన్‌హెచ్‌పిసి, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, కోల్ ఇండియా, ఐఆర్ఎఫ్‌సి, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇలా పలు ప్రభుత్వ సంస్థల్లో వాటాల్ని విక్రయించింది. ఇప్పుడు ఇతర ప్రభుత్వ బ్యాంకుల్లో వాటా విక్రయం సహా బ్యాంకుల ప్రైవేటీకరణ అంశం తెరపైకి వచ్చింది. కేంద్రం ప్రస్తుతం 4 ప్రభుత్వ రంగ బ్యాంకులు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంకు, పంజాబ్ అండ్ సింద్ బ్యాంకు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుల్లో తమ వాటాను విక్రయించి 75 శాతం దిగువకు చేర్చాలని భావిస్తోంది. ఇదేసమయంలో ప్రభుత్వ బ్యాంకుల విలీనం లేదా ప్రైవేటీకరణ అంశాలపైనా పనిచేస్తుందని తెలుస్తోంది. మరో 2 బ్యాంకుల్ని ప్రైవేటీకరించనున్నట్లు, ఆ దిశగా కేంద్రం అడుగులు వేస్తున్నట్లు విస్తృత ప్రచారంలోకి వచ్చింది. నీతి ఆయోగ్ మాత్రం సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకుల్ని ప్రైవేటీకరించడానికి షార్ట్ లిస్ట్ చేసినట్లు సమాచారం. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వానికి 92.44 శాతం వాటా ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో 2.17 శాతం వాటా విక్రయించి రూ. 1419 కోట్లు సమీకరించింది. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 81.19 శాతం వాటాను కేంద్రం కలిగి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే 8.08 శాతం వాటాను విక్రయించి సుమారు రూ. 2666 కోట్లు సేకరించింది. యూకో బ్యాంకులో 90.95 శాతం వాటా ప్రభుత్వానిదే. పంజాబ్ అండ్ సింద్ బ్యాంకు విషయానికి వస్తే కేంద్ర ప్రభుత్వం 93.85 శాతం వాటా కలిగి ఉంది. ప్రభుత్వ బ్యాంకులు 10కిపైగా ఉండగా, పలు చిన్న బ్యాంకుల్ని విలీనం చేసి దేశంలో పెద్ద బ్యాంకుల్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు కూడా తెలుస్తోంది.

# నాలుగు రోజుల్లోనే రూ.21లక్షల కోట్లు ఆవిరి

వాణిజ్యం



**ముంబయి, అక్టోబరు 24:** భారతీయ స్టాక్ మార్కెట్లను పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు తీవ్రంగా కుదిపేస్తున్నాయి. నాలుగు రోజుల్లోనే రూ.21 లక్ష కోట్ల సంపద ఆవిరైపోయింది! ముడి చమురు ధరల అసాధారణ పెరుగుదల, దేశంలో ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందన్న భయాల కారణంగా మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి భారీగా పెరిగింది. దీంతో గత నాలుగు ట్రేడింగ్ సెషన్లలోనూ సెన్సెక్స్ నష్టాలతోనే ముగిసింది. ఫలితంగా బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ సుమారు రూ.20.79 లక్ష కోట్లు ఆవిరైపోయింది. ఈ ఒక్క వారంలోనే సెన్సెక్స్ ఏకంగా 1,600 పాయింట్లకు పైగా పడిపోయింది. వారాంతపు ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 125.56 పాయింట్లు (0.17 శాతం) నష్టపోయి 73,123.83 వద్ద ముగిసింది. పండుగ సెలవుల కారణంగా ఈ వారం ట్రేడింగ్ రోజులు తక్కువగా ఉన్నప్పటికీ, సెన్సెక్స్ మొత్తం మీద 1,605.44 పాయింట్లు (2.15 శాతం) కోల్పోయింది. అక్టోబర్ 16న బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.4,72,62,167.42 కోట్లుగా ఉండగా కేవలం నాలుగు రోజుల్లోనే అది రూ.4,51,83,393.14 కోట్లకు పడిపోయింది. ఇక, భారత స్టాక్ మార్కెట్లు ఇంత భారీగా పడిపోవడానికి ప్రధానంగా ఐదు కారణాలు కనిపిస్తున్నాయి. పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు, అమెరికాఇజ్రాయెల్ దాడుల ముప్పు మదుపర్లను కలవరపెడుతున్నాయి. మరోవైపు బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 116.73 డాలర్లకు ఎగబాకడంతో దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుతుందనే భయాలు ముంచుకొచ్చాయి. పెరిగిన చమురు ధరల వల్ల ఆర్థిక వ్యవస్థపైనా, కంపెనీల నిర్వహణ ఖర్చులపైనా తీవ్ర భారం పడుతుందని భావించిన మదుపర్లు పెద్ద ఎత్తున షేర్లను విక్రయించారు. అమెరికా మార్కెట్లలోని బలహీనతలు, రూపాయి మారకం విలువ పడిపోవడం, అమెరికా బాండ్ ఈల్డ్స్ పెరగడం వంటి పరిణామాలు కూడా మన దేశ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. ముఖ్యంగా ముడి చమురు ధరల భగ్గుమంటుండటంతో ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న ఆందోళనలు ఎక్కువయ్యాయి. పశ్చిమాసియాలో అశాంతి కారణంగా చమురు సరఫరా నిలిచిపోతుందనే భయంతో బ్రెంట్ క్రూడాయిల్ ధర ఐదు నెలల గరిష్ట స్థాయికి చేరింది. ఇరాన్ అణు, సైనిక స్థావరాలపై దాడుల అంచనాలు, యెమెన్ హూతీ రెబెల్స్ సౌదీ అరేబియా చమురు కేంద్రాలను లక్ష్యంగా చేసుకోవడం వంటి పరిణామాలు మార్కెట్‌లో అనిశ్చితిని మరింత పెంచాయి. ఈ మార్కెట్ పతనంలో కొన్ని కంపెనీల షేర్లు తీవ్ర నష్టాలను చవిచూశాయి. రూపాయి బలహీ నపడటం, విదేశీ మార్కెట్ల పతనం కూడా మన దేశంపై ప్రభావం చూపాయి. అమెరికా మార్కెట్లు పడిపోవడంతో భారతీయ ఇన్వె స్టర్లు ఆచితూచి వ్యవహరించారు. రాబోయే రోజుల్లో మార్కెట్ గమనాన్ని మార్చే కొన్ని కీలక పరిణామాలు ఎదురుకానున్నాయి. ఇన్వెస్టర్ల చూపు ప్రధానంగా జియో ప్లాట్‌ఫారమ్స్ షేర్ల మార్కెట్ ఎంట్రీపై ఉంది. ఈనెల 28న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్ట్ కానుంది. దీనికి వస్తున్న స్పందన మార్కెట్ ట్రెండ్‌కు అద్దం పట్టనుంది. అలాగే ఈనెల27, 28 తేదీల్లో జరగనున్న అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల సమావేశంపై అందరి దృష్టి ఉంది. అమెరికాలో నిరుద్యోగ వివరాలు, జీడీపీ వృద్ధి అంచనాలు, జపాన్ సెంట్రల్ బ్యాంక్ నిర్ణయాలు కూడా గమనించదగ్గ అంశాలు. వీటితో పాటు పేటీఎం, టాటా కన్స్యూమర్, ఎల్అండ్‌టీ, మారుతి సుజుకి, హిందుస్థాన్ యునిలీవర్, అదానీ పోర్ట్స్, ట్రెంట్, సన్ ఫార్మా, బీఈఎల్ వంటి ప్రముఖ కంపెనీల త్రైమాసిక ఫలితాలు మార్కెట్ దిశను నిర్దేశించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. మొత్తానికి, ముడి చమురు ధరలు శాంతించడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గడం, విదేశీ మదుపర్ల పెట్టుబడులు మళ్లీ పుంజుకోవడం, కంపెనీల నుంచి మెరుగైన ఫలితాలు రావడం వంటి అంశాలపైనే భారతీయ స్టాక్ మార్కెట్ కోలుకోవడం ఆధారపడి ఉంటుంది. రూపాయి విలువ బలపడి, అమెరికా బాండ్ ఈల్డ్స్ తగ్గితేనే మదుపర్లలో మళ్లీ నమ్మకం కుదిరే అవకాశం ఉంది.

## ఆగస్టులో ఆర్‌బిఐ నికర డాలర్ కొనుగోళ్లు 132% వృద్ధి

### తొలిసారిగా 200 బిలియన్ డాలర్లు దాటిన ఫార్వర్డ్ నికర షార్ట్ పొజిషన్

**ముంబయి, అక్టోబరు 24:** భారతీయ రిజర్వ్ బ్యాంక్ గత ఆగస్టులో నికర డాలర్ కొనుగోళ్లను 132 శాతం పెంచి 43.3 బిలియన్ డాలర్లకు చేర్చింది. ప్రవాస భారతీయుల నుంచి బ్యాంకులు సమీకరించిన ఎఫ్‌సీఎన్ఆర్(బి) డిపాజిట్లకు సంబంధించి ఆర్‌బీఐ అందించిన రాయితీతో కూడిన డాలర్‌రూపాయి స్వాప్ సదుపాయం ద్వారా వచ్చిన నిధుల ప్రవాహం దీనికి ప్రధాన కారణమైంది. ఇదే సమయంలో ఆర్‌బీఐ నికర ఫార్వర్డ్ షార్ట్ పొజిషన్ తొలిసారిగా 200 బిలియన్ డాలర్లను దాటింది. ఆగస్టులో ఆర్‌బీఐ మొత్తం 74.5 బిలియన్ డాలర్లను కొనుగోలు చేసింది. జూలైలో కొనుగోలు చేసిన 38.4 బిలియన్ డాలర్లతో పోలిస్తే ఇది 93.9 శాతం అధికం. మరోవైపు, డాలర్ల విక్రయాలు నెలవారీ ప్రాతిపదికన 57.9 శాతం పెరిగి జూలైలోని 19.8 బిలియన్ డాలర్ల నుంచి ఆగస్టులో 31.2 బిలియన్ డాలర్లకు చేరాయి. 2025 ఆగస్టులో విక్రయించిన 7.7 బిలియన్ డాలర్లతో పోలిస్తే ఇవి 305.6 శాతం ఎక్కువ. ఆగస్టులో ఆర్‌బీఐ నికర డాలర్ కొనుగోళ్లు 43.3 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. జూలైలో నమోదైన 18.7 బిలియన్ డాలర్లతో పోలిస్తే ఇవి 132 శాతం అధికం. దేశీయ, విదేశీ ఓవర్‌దికౌంటర్ (ఓటీసీ) మార్కెట్లలో స్థూల లావాదేవీల విలువ



105.7 బిలియన్ డాలర్లను మించింది. ప్రవాస భారతీయుల నుంచి బ్యాంకులు ఎఫ్‌సీఎన్ఆర్(బి) డిపాజిట్ల రూపంలో సమీకరించిన 127 బిలియన్ డాలర్లను స్వీకరించడంలో ఆర్‌బీఐ డాలర్ కొనుగోళ్లు కీలక పాత్ర పోషించాయి. రూపాయిపై ఒత్తిడి పెరగడంతో దేశీయ కరెన్సీకి మద్దతుగా ఆర్‌బీఐ డాలర్లను విక్రయించింది. ఆగస్టులో చేసిన 31.2 బిలియన్ డాలర్ల విక్రయాలు, ఎఫ్‌సీఎన్ఆర్(బి) డిపాజిట్ల ద్వారా సమీకరించిన మొత్తంలో దాదాపు నాలుగో వంతుకు సమానం. రూపాయిపై ఒత్తిడి కొనసాగుతున్న నేపథ్యంలో, 16తో ముగిసిన వారంలో భారత విదేశీ మారక నిల్వలు 5.01 బిలియన్ డాలర్లు తగ్గి 721.02 బిలియన్ డాలర్లకు చేరాయి. విదేశీ మారక నిల్వల్లో అతిపెద్ద భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు తాజా వారంలో 5.76 బిలియన్ డాలర్లు తగ్గాయి. బంగారు నిల్వల విలువ 706 మిలియన్ డాలర్లు పెరగడంతో మొత్తం నిల్వల తగ్గుదల కొంత మేరకు పరిమితమైంది.

## టాటా మోటార్స్ ఆదాయంలో 20% నాన్‌సైక్లికల్ వ్యాపారాల నుంచే!




**ముంబయి, అక్టోబరు 24:** దేశీయఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్ తన మొత్తం ఆదాయంలో సుమారు 20 శాతం నాన్‌సైక్లికల్ వ్యాపారాల నుంచి వస్తున్నట్లు వెల్లడిం చింది. వాణిజ్య వాహనాలడిమాండ్ వృద్ధి భవిష్యత్తులో మందగించే అవకాశం ఉన్న నేపథ్యంలో, ఈవ్యాపారాల వాటాను మరింత పెంచుకోవా లని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుందని టాటా మోటార్స్ చీఫ్ బిజినెస్ ఆపరేషన్స్ ఆఫీసర్ గిరీష్ వెల్లడించారు. సాధారణంగా వాణిజ్య వాహనాల పరిశ్రమలో కనిపించే వ్యాపార చక్రాల హెచ్చుతగ్గుల ప్రభావాన్ని తగ్గించేందుకు నాన్‌సైక్లికల్ వ్యాపారాలు సహజ రక్షణగా పనిచేస్తాయని వివరించారు. ఈ 20 శాతం ఆదాయానికి సంబంధించిన వ్యాపారాల వివరాలను ఆయన వెల్లడించలేదు. సెప్టెంబర్ త్రైమాసికంలో టాటా మోటార్స్ బలమైన వృద్ధిని నమోదు చేసింది. కంపెనీ స్టాండలోన్ ఆదాయం గత ఏడాదితో పోలిస్తే 42 శాతం పెరిగి రూ.23,900 కోట్లకు చేరుకుంది. ఈ కాలంలో మొత్తం హోల్‌సేల్స్ 1,35,100 యూనిట్లుగా నమోదయ్యాయి. పరిశ్రమలో వాహనాల విక్రయాలు 28.4 శాతం పెరగగా, టాటా మోటార్స్ వాహనాల పరిమాణం 30.5 శాతం వృద్ధి చెందినట్లు గిరీష్ తెలిపారు. గత ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన 21.5శాతం వృద్ధితో పోలిస్తే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం లో వృద్ధి సింగిల్ డిజిట్ స్థాయిలో లేదా డబుల్ డిజిట్ ప్రారంభ స్థాయిలో ఉండవచ్చని ఆయన అంచనా వేశారు. హెవీ,స్మాల్ కమర్షియల్ వెహికల్స్ విభాగాల్లో వృద్ధి సింగిల్ డిజిట్‌కే పరిమితం కావచ్చని పేర్కొన్నారు. డీజిల్ ధరలు, వడ్డీ రేట్ల మార్పులను నిశితంగా గమనించాల్సి ఉంటుందని తెలిపారు. ఇప్పటికే 25 బేసిస్ పాయింట్ల వడ్డీ రేటు పెంపు జరిగిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ముడిసరుకుల ధరల పెరుగుదల కంపెనీ లాభదాయకతపై ఒత్తిడి పెంచుతోంది. మూడో త్రైమాసికంలో కమోడిటీ వ్యయాల ప్రభావం మరో 150-200 బేసిస్ పాయింట్లు పెరిగే అవకాశం ఉందని గిరీష్ తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఇప్పటికే కమోడిటీ వ్యయాల ప్రభావం 540 బేసిస్ పాయింట్లుగా ఉందని వివరించారు. ఈ ఆర్థికసంవత్సరంలో నాలుగువిడతలుగా వాహనధరలను పెంచినప్పటికీ, పెరుగు తున్న వ్యయాలను పూర్తిగా భర్తీచేయడానికి ఆ పెంపులు సరిపోవడం లేదని పేర్కొన్నారు. కంపెనీ చీఫ్‌ఫైనాన్షియల్ ఆఫీసర్ రమణన్ తెలిపిన వివరా ప్రకారం, స్టాండలోన్ ఎబిడిటా మార్జిన్ 11.7 శాతంగా నమోదైంది. విడిభాగాలు, సేవల మార్కెట్ విభాగం నిరంతర వృద్ధిని సాధిస్తోందని కంపెనీ వెల్లడించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Superior Printers (P) Ltd. and published at Plot No.4-40/1, Alugunuru, 'X' Roads, Karimnagar-505527. Ph:2223355,2277034, 35, FAX: 2277036; Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. RNI No.APTEL/2001/07563.